ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
మంగళవారం 2 సెప్టెంబరు 2025

వరద సహాయక చర్యలను పకడ్బందీగా చేపట్టాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వరద సహాయక చర్యలను జిల్లా అధికారులు పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ నుంచి రాష్ట్ర మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్‌ఝాతో పాటు జిల్లా అధికారులతో జిల్లాలో వరదలపై సమీక్షించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో దెబ్బతిన్న కాలువలు, చెరువులు, కుంటల వివరాలను కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. వర్షాలకు దెబ్బతిన్న వాటిని మరమ్మ తులు చేయడానికి యాక్షన్ ప్లాన్‌ను సిద్ధంచేయాలని సీఎం ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ వరదల్లో సిరిసిల్ల జిల్లాకు చెందిన ఒకవ్యక్తి గల్లంతయ్యారని ఇప్పటివరకు అతని ఆచూకీ లభించ లేదని తెలిపారు. సెర్చింగ్ టీంలను ఏర్పాటుచేసి గాలింపు చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో 38ఇళ్లు డామేజ్ అయ్యాయని నష్ట పరిహారం అందించామని మూడు పశువులు మృతి చెందాయని తెలిపారు. పాక్షికంగా రోడ్లు , 561 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, వేములవాడ ఆర్డీవో రాధాబాయ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

● కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్లకలెక్టరేట్ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచి సకాలంలో పూర్తిచేసే విధంగా మండల ప్రత్యేక అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ప్రభుత్వం 8వేల 811 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా 5292 ఇళ్లు మార్కింగ్ చేయడం జరిగిందని, 2921 ఇళ్లు బేస్మెంట్ స్థాయికి, 146 ఇళ్లు గోడల వరకు, 451 ఇళ్లు రూఫ్ వరకు ఒక ఇళ్లు నిర్మాణం పూర్తిగా జరిగిందన్నారు. ఇళ్లకు ఇసుక తీసుకెళ్లేందుకు కూలి, రవాణా చార్జీలు మాత్రమే లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో ఎక్కడైనా రూ. 15 వందల కంటే ఎక్కువ ట్రాక్టర్ ఇసుక సరఫరా కోసం వసూలు చేస్తే అధికారుల దృష్టికి లబ్ధిదారులు తీసుకరావాలని స్పష్టం చేశారు. మండల ప్రత్యేక అధికారులు విద్యాసం స్థలు, ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ శంకర్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

రైల్వేలైన్ కోసం మట్టి తరలింపునకు అనుమతులు తీసుకోవాలి

సిరిసిల్ల కలెక్టరేట్ : జిల్లాలో రైల్వేలైన్ నిర్మాణానికి మట్టి తరలింపుకు అవసరమైన అనుమతులు పకడ్బందీగా పొందాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా కోరారు. సిరిసిల్ల సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం రైల్వేలైన్ నిర్మాణా పనులకు అవసరమైన మట్టి అనుమతులపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైల్వేలైన్ నిర్మాణం కోసం తంగళ్లపల్లి మం డలం అంకుసాపూర్ గ్రామంలోని చంద్ర వాడు చెరువు నుంచి లక్ష క్యూబిక్ మీటర్ల మట్టి కేటాయింపు చేయగా ఇప్పటివరకు 90వేల 672 క్యూబిక్ మాటర్ల మట్టిని తరలింపు జరిగిందన్నారు. సిరిసిల్లలో రైల్వేస్టేషన్ నిర్మాణాం, రైల్వేలైన్ నిర్మాణం కోసం సమీపంలోగల పాయింట్‌నుంచి అవసరమైనమట్టి తరలింపు కేటాయింపు చేయాలని దీనికి తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ అదేశించారు. మట్టి తరలింపుకు తగిన విధంగా సినరేజీ చార్జీలు వసూలు చేయాలన్నారు. నిర్ధేశిత కేటాయింపుల మేరకు మాత్రమే మట్టి తరలింపు జరుగా లని అదనంగా మట్టి తరలించడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రైల్వే శాఖ ఇంజనీరింగ్ అధికారి మూర్తి , కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీన్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతు దిగాలు



తేమ ఎక్కువై కుళ్లిపోతున్న మొక్కలు



పత్తి చేనులో నిలిచిన నీరు

● మొదట్లో అనావృష్టి.. ఇప్పుడు అతివృష్టి
● పంట ఎదగక దిగుబడిపై ఆందోళన
● జిల్లాలో 46,385 వేల ఎకరాల్లో సాగు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

తెల్ల బంగారం రైతులకు ఆదిలోనే కష్టాలు మొదలయ్యాయి. రాజన్నసిరిసిల్ల జిల్లాలో వర్షాకాలం మొదట్లో అనావృష్టి ఇప్పుడు అతి వృష్టి దిగాలు పరుస్తోంది. అల్పపీడన ప్రభావంతో పత్తి రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. జిల్లాలో వరిసాగు తర్వాత ప్రధానంగా పత్తి సాగు వైపు రైతులు మొగ్గు చూపారు. జిల్లాలో వానాకాలం సాగు ఆరంభంలోనే రుతుపవనాలు ఉరించాయి. సమృద్ధిగా వర్షాలు ఉంటా యనే ఆశతో పత్తి రైతులు ముందే విత్తనాలు వేసుకు న్నారు. వర్షాలు ముఖం చాటేయడంతో మొలక దశలోని ఎదుగుదల లేక ఆగిపోయింది. కొందరు రైతులు మరోసారి విత్తనాలు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తర్వాత అల్పపీడన ప్రభావంతో వర్షాలు కొంత ఊరట నిచ్చాయి. పత్తి విత్తనాలు వేగంగా వేసుకున్నారు. ఆశలు కల్పించిన వర్షాలు అతివృష్టిగా మారి నష్టాలను మిగిలిస్తోంది.

150 ఎకరాల్లో పంట నష్టం

వానాకాలం సీజన్లో 2.35లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో వరి 1.84లక్షల ఎకరాలు, పత్తి 46,385 ఎకరాల్లో సాగు చేశారు. పత్తి సాగు రైతులకు ఆశాజనకంగా మారుతున్న క్రమంలో ఆగస్టు మాసంలో పది రోజుల్లోనే అంతా తారు మారైంది. అల్పపీడనం వర్షాలతో పత్తి పంట దెబ్బతిం ది. జిల్లాలో వ్యవసాయ శాఖ వేసిన ప్రాథమిక అంచనా మేరకు 560 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లిన ట్లుగా తేలింది. ఇందులో పత్తి 150ఎకరాల వరకు ఉంది. ఇల్లంతకుంట, ఎల్లారెడ్డిపేట, కోనరావుపేట, బోయిన్‌పల్లి, వీర్నపల్లి మండలాల్లో పత్తి పంటకు ఎకరాల్లోనే వర్షాలు నష్టాన్ని మిగిలించిందని రైతులు వాపోతున్నారు. వర్షాలకు పత్తి పూత రాలిపోగా మొక్కలు కుళ్లి పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కలుపు బాగా పెరిగి అదనపు భారాన్ని మోయాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు జాలు పట్టిన చేలకు యూరియా వెయ్యాలన్న ఎరువులు దొరకక ఇబ్బందులు పడుతున్నామని రైతులు చెబుతున్నారు.

జిల్లాలో వానకాలం పాగు ఇలా..

మండలం	మొత్తం	పత్తి
గంభీరావుపేట	18598	85
ఇల్లంతకుంట	36970	12000
ముస్తాబాద్	23835	530
సిరిసిల్ల	5623	800
తంగళ్లపల్లి	21086	870
వీర్నపల్లి	8300	300
ఎల్లారెడ్డిపేట	21100	3600
బోయినపల్లి	19167	6400
చందుర్తి	21367	6200
కోనరావుపేట	23140	4800
రుద్రంగి	10964	2200
వేములవాడ	10038	4800
వేములవాడ రూరల్	15142	3800
మొత్తం	235330	46385

యూరియా కోసం రైతులకు తప్పని తిప్పలు

● మేములాడలో క్యూలైన్.. రోడ్డుపై రైతుల ధర్నా
● మద్దతు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు

వేములవాడటౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలంతో పాటు చుట్టుపక్కల రైతులకు యూరియా కొరత తప్పడం లేదు. సోమవారం ఉదయం యూరియా కోసం వేములవాడ పట్టణంలోని ప్రైవేటు ఫర్టిలైజర్ దుకాణాల ముందు రైతులు బారులు తీరారు. రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో దుకాణాల ముందు గంటల తరబడి క్యూలైన్‌లో దుకాణాల ముందు నిరీక్షించారు. రైతులు గంటలపాటు క్యూలైన్‌లో నిరీక్షించడంతో రోడ్డుపైన ట్రాఫిక్ నిలిచిపోయి అంతరాయం కలిగింది. మధ్యాహ్నం వరకు రైతులకు పాసుపుస్తకంపై యూరియా బస్తాలు పంపిణీ చేసినప్పటికీ , మధ్యాహ్నం తరువాత యూరియా బస్తాలు తక్కువ ఉండి, రైతులు ఎక్కువగా ఉండటంతో దుకాణాదారులు షాపులు మూసివేసి వెళ్లారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు రోడ్డుపైన బైఠాయించి ఆందోళనకు దిగారు. రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. పోలీసులు, వ్యవసాయాధికారి సంఘటన స్థలానికి చేరుకుని దుకాణంలో ఉన్న యూరియా బస్తాలను రైతులకు అందిరికీ వచ్చేలా ఒక్కో బస్తాను అందజేశారు.

ఇల్లంతకుంటలో..

ఇల్లంతకుంట : రైతులకు యూరియా కష్టాలు ఇప్పట్లో తీరేలా లేవు. మండలకేంద్రంలోని మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువుల విక్రయకేంద్రానికి యూరియా బస్తాలు వచ్చాయని తెలుసుకున్న రైతులు సోమవారం తెల్లవారకముందే వర్షం పడుతున్నా లెక్కచేయకుండా కేంద్రం ఎదుట నీరిక్షించారు. దుకాణం తెరిచిన తర్వాత రైతులు ఒక్కసారిగా రావడంతో పోలీసుల సహకారంతో పంపిణీ చేశారు. అనంతరం వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతులకు టోకెన్లు ఇస్తామని పేర్కొనడంతో పెద్దసంఖ్యలో రైతులు కార్యాలయానికి చేరుకున్నారు. వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి మాట్లాడుతు వచ్చిన యూరియా బస్తాలను పంపిణీ చేశామని, రెండు రోజుల్లో వస్తుందని ఆందోళన చెందవద్దని సూచించారు.



వేములవాడలో యూరియా కోసం బారులు తీరిన రైతులు



యూరియా కోసం రాస్తారోకో చేస్తున్న రైతులు

యూరియా బస్తాల లారీని అడ్డుకున్న రైతులు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట) : వీర్నపల్లి మండలం గర్జనపల్లిలో తమకు అందించకుండా సీతారాంనాయక్‌తండా, జవహర్‌నాయక్ తండాలకు యూరియా బస్తాలను ఎలా తీసుకెళ్తారంటూ లారీని స్థానిక బస్టాండు ప్రాంతంలో గ్రామ రైతులు సోమవారం అడ్డుకున్నారు. సుమారు గంట పాటు లారీ ఎదుట నిలబడి నిరసన తెలిపారు. వన్‌పల్లిలోని మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల దుకాణానికి 440 యూరియా బస్తాలు రావడంతో లారీని గర్జనపల్లి మీదుగా సీతారాంనాయక్, జవహర్‌నాయక్ తండాలకు తీసుకెళ్తున్నారు. విషయం తెలుసుకున్న గర్జనపల్లి రైతులు లారీ అడ్డుకున్నారు. అక్కడికి వచ్చిన అధికారులతో వాగ్వివాదానికి దిగారు. గ్రామంలోనే పంపిణీ చేయడంలో శాంతించారు.

గంభీరావుపేట : మండల కేంద్రంలో సోమవారం యూరియా కోసం రైతులు తిప్పలు పడ్డారు. యూరియా వచ్చిందని తెలియగానే రైతులు స్థానిక సింగిల్‌విండో ఆపీస్ వద్దకు వచ్చి, క్యూ కట్టారు. 670 బస్తాలు మాత్రమే రావడంతో మిగిత రైతులకు టోకెన్లు ఇచ్చారు. ఈ విషయమై సీఈవో రాజిరెడ్డిని అడగా, వచ్చిన యూరియాను రైతులకు క్యూ పద్ధతిలో ఇచ్చామని, దొరకని రైతులకు టోకెన్లు ఇచ్చామని, టోకెన్లు ఇచ్చిన రైతులకు మంగళవారం ఇస్తామని సీఈవో రాజిరెడ్డి చెప్పారు.

ముస్తాబాద్ : యూరియా కోసం ముస్తాబాద్ మండల కేంద్రంలో రైతులు రోడ్డెక్కారు. సోమవారం ముస్తాబాద్‌లో ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు. వారికి మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లడుతూ యూరియా లేక పత్తి, వరి పంట ఎదగడం లేదని మడ్డిపడ్డారు.



గంభీరావుపేటలో యూరియా కోసం సింగిల్‌విండో వద్ద బారులు



యూరియా బస్తాలతో వెలుతున్న లారీని అడ్డుకుంటున్న రైతులు



ఇల్లంతకుంటలో యూరియా కోసం నిరీక్షిస్తున్న రైతులు

బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదంపై కాంగ్రెస్ సంబరాలు



సిరిసిల్లలో సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : శాసన సభ సమావేశాలలో కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు రిజర్వేషన్లను 42 శాతంకు పెంచుతూ బిల్లును ఆమోదింప జేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయం జిల్లా సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఎక్కడ లేని విధంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కులగ ణన చేపట్టి ఆదర్శంగా నిలిచిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రులకు, విప్ ఆది శ్రీనివాస్‌కు బీసీల పక్షాన కృతజ్ఞతల ను తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, ఉపాధ్యక్షుడు బొప్ప దేవయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అహ్మద్, మార్కెట్ కమిటి డైరెక్టర్ దుబాల వెంకటేశం, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు ఆడెపు చంద్రకళ, యెల్లె లక్ష్మీనారాయణ, రాగుల జగన్, వెంగళ లక్ష్మీనర్సయ్య, ఆడెపు ప్రభాకర్, అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ నేరెళ్ళ శ్రీకాంత్‌గౌడ్, పద్మశాలి సంఘం పట్టణ మాజీ అధ్యక్షుడు గోలి వెంకటరమణ, నాయకులు అన్నల్‌దాస్ భాను, కల్లూరి చందన పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లును గవర్నర్ ఆమోదించాలి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు



మాట్లాడుతున్న రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శహన్మాండ్లు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పెంచుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన ఏకగ్రీవ తీర్మానాన్ని గవర్నర్ మోదించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పర్శ హన్మాండ్లు మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్న సంకల్పాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా చిత్తశుద్ధితో పనిచేసిందని బీసీ సంక్షేమ సంఘం పక్షాన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి వర్గానికి ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు తడక కమలాకర్, కంచర్ల రాజు, చొక్కి కైలాసం, కోడం రవీందర్, సామల తిరుపతి, దండు శ్రీనివాస్ ఉన్నారు.

ఈ నెల 6న వినాయక నిమజ్జనం

సిరిసిల్లటౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈ నెల 6న వినాయక నిమజ్జనం నిర్వహించుకోవాలని హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు చేపూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వేద పండితుడు రేపాక రాజుశర్మతో కలసి శ్రీనివాస్ మాట్లాడారు. ఈనెల 7 ఆదివారం చంద్రగ్రహణం ఉండడం వల్ల వినాయక నిమజ్జనంపై ప్రజలలో అనేక సందేహాలకు తావిస్తుందన్నారు. గత 50 సంవత్సరాలుగా సిరిసిల్లలో అనంత చరుర్ధి రోజునే వినాయక నిమజ్జనం చేయ డం ఆనవాయితీగా వస్తుందన్నారు. అనంత చతుర్ధి ఈ నెల 6న కాబట్టి వినా యక నిమజ్జనం ఆ రోజే చేయాలని అన్నారు. ఈ నెల 7న రాత్రి చంద్ర గ్రహ ణం ఉంటుందన్నారు. సమావేశంలో హిందూ ఉత్సవసమితి సభ్యులు మెరుగు సత్యానారాయణ, గాజుల వేణు, గుడ్ల శ్రీధర్, బైరగోని వెంకన్న, ఆడెపుహరీష్ పాల్గొన్నారు.

రుద్రంగిలో సబ్‌స్టేషన్‌కు నిధులు మంజూరు

రుద్రంగి, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి) రుద్రంగి మండల కేంద్రంలో 132/33 కేవి నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి రూ. 47.25 కోట్లు నిధులు మంజూరు చేస్తు సీఏండీ కృష్ణా బాస్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. నిధులు మంజూరు చేసిన సిఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లకు రైతులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

పింఛన్‌దారులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

వేములవాడ టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలో వికలాంగులకు పెన్షన్ పెంచుతామని హామీచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతున్న పెంచడం లేదని పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నారు. వేములవాడ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన పెన్షన్‌దారుల మహా గర్జన సన్నాహక సదస్సుకు ముఖ్యఅతిథిగా సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ వికలాంగులకు రూ. 6 వేలు, వృద్ధులకు, వితంతువులకు, ఒంటరిమహిళలకు, నేత, గీత, బీడీ కార్మికులు, డయాలసిస్ రోగులకు పెన్షన్ రూ. 4 వేలు ఇవ్వాలని, కండరాల క్షీణత కలిగిన వారికి రూ. 15 వేలు పెన్షన్ ఇవ్వాలని గత ఎన్నికల్లో కోరామని గురుచేశారు. శాసనసభ ఎన్నికల సయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తప్పకుండా పెన్షన్ పెంచుతామని హామీచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల హామీలో ఇచ్చిన మాట తప్పుతున్న కాంగ్రెస్ పార్టీని నిందించాల్సిన ప్రతిపక్ష నేత కేసీఆర్ మౌనంగా ఉంటున్నాడంటే దొరకు పెన్షన్‌దారుల సమస్యలు అక్కర్లేదని తెలుస్తుందని విమర్శిం చారు. హైదరాబాద్‌లో నిర్వహించే మహాగర్జన సభలో వేములవాడ నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున పెన్షన్‌దారులు పాల్గొని ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరారు. కార్యక్రమంలో పుట్ట రవి, శోభరాణి, లక్ష్మణ్, గుండ థామస్, మరాఠి తిరుపతి, ఆవునూరి ప్రభాకర్, బిక్షపతి, జింక శ్రీధర్ తదితరులు ఉన్నారు.



వేములవాడ మహాగర్జన సదస్సులో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

బాధితులకు సత్వర న్యాయం చేయడానికే గ్రీవెన్స్ డే

● ఎస్పీ మహేశ్ బి. గీతే

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): బాధితులకు సత్వర న్యాయం చేయడానికే గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎస్పీ మహేశ్ బి. గీతే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో 32ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్ డే ఉపయోగపడుతుందన్నారు. అర్జిదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్ స్టేషన్‌ల ఎస్‌హెచ్‌ఓలకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్ట పరంగా త్వరితగతిన పరిష్కారించాలని ఆదేశించామన్నారు. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషిచేయడం జరుగుతుందన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి వినతులు, ఫిర్యాదులు స్వీకరించి అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదు దారునికి పోలీస్‌శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో పొందుపరస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందించడం జరుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ మహేశ్ బి. గీతే

గణేశ్ నిమజ్జనం సందర్భంగా మూడురోజుల పాటు వైన్స్, కల్లు దుకాణాలు బంద్

సిరిసిల్ల క్రైం : గణేశ్ నవరాత్రుల సందర్భంగా నిమజ్జన వేడుకల సందర్భంగా శాంతిభద్రతలను కాపాడేందుకు జిల్లాలోని అన్ని మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్‌లు, కల్లు దుకాణాలు, కల్లుడిపోలను తాత్కాలికంగా మూసి వేయాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సోమవారం ఆదేశాలు జారిచేశారు. ఈ ఆదేశాల్లో భాగంగా ఈనెల 4న ఉదయం 6గంటల నుండి 7న ఉదయం 6గంటల వరకు వైన్ షాప్‌లు, బార్ అండ్ రెస్టారెంట్ లు, కల్లు దుకాణాలు, కల్లు డిపోలు మూసివేయాలని సంబంధిత ఎక్సైజ్‌శాఖను కలెక్టర్ ఆదేశించారు. ప్రతి వైన్స్ లైసెన్స్ దారులు, కల్లు డిపో యజమానాలు ఈ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్, పోలీసుశాఖలు వెల్లడించాయి.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్ గ్రామ శివారులో పట్టుకున్నామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి శనివారం పేర్కొన్నారు. రాచర్లతిమ్మాపూర్‌కు చెందిన వాహన డ్రైవర్‌ను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరు పర్చడంతో న్యాయమూర్తి 14 రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించారని తెలిపారు. రాచర్లతిమ్మాపూర్ గ్రామ శివారులో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ఇసుక రవాణా చేస్తూ పట్టుబడ్డాడని చెప్పారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించడంతో పాటు డ్రైవర్‌ను అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. ప్రభుత్వఅనుమతి లేకుండా ఇసుకతరలిస్తే కఠినచర్యలు తప్పవని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి హెచ్చరించారు.

కరీంనగర్ రూరల్ మండలం పరిధిలో..

కరీంనగర్ క్రైం: కరీంనగర్ రూరల్ మండలం పరిధిలో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ ఎం.రాజశేఖర్‌ను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

తెగులు..దిగులు..


ఎర్రబారుతున్న వరి

- వరిలో ఎండు ఆకు తెగులు
- మొగి పురుగును మరువక ముందే మరో తెగులు
- రైతుల్లో ఆందోళన
- సస్యరక్షణ చర్యలు చేపడితే సత్ఫలితాలు

చొప్పదండి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వరి పంటకు బ్యాక్టీరియా ఎండు ఆకు తెగులు సోకుతోంది. ప్రస్తుతం వరిపైరు పిలకలు తొడిగే దశలో ఉండగా ఎండు ఆకు తెగులు సరికొత్త సమస్యగా మారింది. నాలుగేళ్లుగా వరిపంటను మొగిపురుగు దెబ్బతీయగా దానిని మరువకముందే మరో తెగులు వరికి సోకుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చొప్పదండి మండలంలో దాదాపు 15వేల ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. జూన్, జూలై నెలల్లో నాటు వేసిన రైతుల పంటపొలాల్లో ఈ బ్యాక్టీరియా ఎండుఆకు తెగులు సోకుతోంది. పంట పొలాల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టి క్రమం తప్పకుండా క్రిమిసంహారక మందులు పిచికారి చేస్తేనే ఫలితం ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

వాతావరణ మార్పులతో సమస్య..

పది రోజులుగా వాతావరణంలో మార్పులు రావడంతోపాటు ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. బ్యాక్టీరియా ఎండు ఆకు తెగులు వరికి సోకినట్లు శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. వరి ఆకులపై పసుపు రంగు మచ్చలు ఏర్పడి, మచ్చలుగా మారి కిందివరకు బ్యాక్టీరియా వ్యాపిస్తోంది. ఫలితంగా ఆకు ఎండిపోతోంది. పసుపు పచ్చని జిగురు వంటి బ్యాక్టీరియా ఆకులపై ఉంటోంది.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి..

ఆకు తెగులు ప్రారంభం కాగానే రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. యూరియా వాడకాన్ని నిలిపివేసి పొలంలోని మొత్తం నీటిని కాల్వల ద్వారా తీసివేయాలి. రైతులు పొలాన్ని ప్రతి నిత్యం గమనిస్తూ ఉండాలి. తెగులు సోకిన పొలం నుంచి ఇతర పొలాల్లోకి నీరు పారకుండా చూడాలి.

పొటాష్ ఎరువును ఆఖరి దఫాలో తప్పనిసరిగా వరికి వేయాలి. తెగులు పై రైతులకు అవగాహన లేనిపక్షంలో వెంటనే మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలి. ఈ తెగులు నివారణకు ఎలాంటి మందులు లేకపోగా సరైన సమయంలో వరిపొలంలో తెగులు లక్షణాలను గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తెగులు నివారణకు చర్యలు చేపట్టాలి..

వంశీకృష్ణ, వ్యవసాయ అధికారి, చొప్పదండి



బ్యాక్టీరియా ఎండు ఆకు తెగులు వ్యాప్తిని అరికట్టడానికి రైతులు సస్యరక్షణ చర్యలను చేపట్టాలి. పొలంలో వీలైనంత మేరకు నీటిని తీసివేసి ఆరబెట్టాలి. పోషకాలకు సంబంధించిన మందులను స్ప్రే చేసుకోవాలి. పొలంలో పాకురు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలి.

చేపల వేటకు వెళ్లి మృత్యు ఒడిలోకి


మేకల రవి(ఫైల్)

ధర్మారం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వైర్‌తో చేపల వేట కోసం వెళ్లిన వ్యక్తి పొరపాటున అదే విద్యుత్ వైర్‌షాక్‌కు ప్రాణాలు కోల్పోయిన సంఘటన ధర్మారం మండలం గోపాల్‌రావుపేటలో చోటు చేసుకుంది. గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన మేకల రవి(50) ఆదివారం సాయంత్రం గ్రామశివారులోని వాగు మత్తడిదగ్గర చేపల వేటకు వెళ్లాడు. సమీపంలోని పంపుసెట్ స్టాటర్ బాక్స్ నుంచి కనెక్షన్ ఇచ్చి చేపలు పట్టేక్రమంలో పొరపాటున రవి కాలు వైరుకు తగికి విద్యుత్‌షాక్‌తో వాగులో పడి మృతిచెందాడు. సోమవారం ఉదయం గ్రామానికిచెందిన వ్యక్తిఅటుగా వెళ్తాండగా రవి మృతి విషయం తెలిసింది. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. రవి భార్య సునిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళా రైతు మృతి


రాజవ్వ(ఫైల్)

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామంలో సోమవారం పెంట రాజవ్వ(69) అనే మహిళారైతు విద్యుదాఘాతంతో మృతి చెందింది. జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజవ్వ గ్రామ శివారులోగల తన మక్కచేను కాపలాకు మధ్యాహ్నం వెళ్లింది. చేనులో తెగిపడిన విద్యుత్‌వైరును గమనించక దానిపై అడుగు వేసింది. దీంతో విద్యుదాఘాతంతో రాజవ్వ అక్కడిక్కడే మృతిచెందింది. రాజవ్వ కుమారుడు తిరుపతి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

కోరుట్ల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని బెండపల్లికి చెందిన మహ్మద్ చాంద్‌పాషా(45)అనే యువకుడు మద్యానికి బానిసై సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు కోరుట్ల రెండవ ఎస్‌ఐ రామచంద్రుడు తెలిపారు. చాంద్‌పాషా పట్టణంలోని శ్రీకృష్ణుడి దేవాలయ సమీపంలో పాన్ టేలా నడిపేవాడు. చాంద్‌పాషాకు కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదం చోటుచేసుకోగా ఇంట్లోనే ఉంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో చాంద్‌పాషా ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. భార్య ఖైర్ ఉనిషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం నగునూర్‌లో పేకాట ఆడుతున్న నలుగురిని సోమవారం అరెస్టు చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. పట్టుబడిన వ్యక్తుల వద్ద నుంచి 41,360 రూపాయల నగదు, కారు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిర్వాహకుడు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

మడేలేశ్వర స్వామి ఆలయంలో చోరీ

ఓదెల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడక శివారులో రజకుల ఆరాధ్యదైవం మడేలేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. అర్ధరాత్రి దాటిన తర్వాత దుండగులు ఇందిరమ్మ చెరువు సమీపంలో ఉన్న మడేలేశ్వర స్వామి ఆలయ తలుపులను ధ్వంసం చేసినట్లు అనవాళ్లు ఉన్నాయి. ఆలయంలోని ఇత్తడి దీపాలు, గంటను దొంగిలించారని, అలాగే గుడిలోని విద్యుత్ బోర్డును ధ్వంసం చేశారని, దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని రజక సంఘం నాయకులు పోలీస్ అధికారులను కోరారు.

కోతుల దాడిలో గాయాలు

సుల్తానాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నీరుకుళ్ల గ్రామానికి చెందిన గుడ్ల శ్రీనివాస్ అనేవ్యక్తి కోతుల దాడిలో గాయపడ్డాడు. శ్రీనివాస్ సుల్తానాబాద్‌లోని బంధువుల ఇంటికి వచ్చాడు. సోమవారం రోడ్డు వెంట వెలుతుంటే ఓ పాపపై కోతుల దాడిని తప్పించాడు. అంతలోనే కోతులు మంద శ్రీనివాస్‌పై దాడిచేసి గాయపరిచాయి. వెంటనే అతన్ని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి అనంతరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- ఇద్దరు బాలుర నుంచి 22.71 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న జగిత్యాల డీఎస్పీ రఘుచందర్

ధర్మపురి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో గత నెల 30న కోలేటి మల్లిఖార్జున్ అనే వ్యాపారి ఇంటిలో జరిగిన దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. ఈకేసులో నిందితులైన ఇద్దరు బాలుర నుంచి22.71తులాల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను జగిత్యాల జువైనల్ జస్టిస్‌బోర్డు ఎదుట హాజరుపరచారు. సోమవారం ధర్మపురి పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ వివరాలు వెల్లడించారు. ఆగస్టు 30 న ధర్మపురి పట్టణంలో కోలేటి మల్లిఖార్జున్ అనే వ్యాపారి ఉదయం తన ఇంటికి తాళం వేసి బట్టల షాపుకు వెళ్లాడు. అదేరోజు రాత్రి ఇంటికి వెళ్లి చూసే సరికి తాళాలు పగులగొట్టి బీరువా తెరచి అందులో ఉన్న 22.71తులాల బంగారు ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ధర్మపురి ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ పోలీస్ స్టేషన్‌లో కేసునమోదు చేయగా సీఐ రాం నర్సింహారెడ్డి విచారణ చేపట్టారు. సీసీటీవీల ఆధారంగా నిందితుల కోసం వెతకగా కోలేటి మల్లిఖార్జున్ ఇంటిలో దొంగతనం చేసింది ఇద్దరు బాలురు (అన్నదమ్ములు)గా గుర్తించారు. నిందితులైన బాలురను ఉదయం వారి ఇంటి వద్ద అదుపులోకి తీసుకొని బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. తక్షణమే స్పందించి కేసును ఛేదించిన ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్‌ఐలు ఉదయ్‌కుమార్, రవీందర్‌కుమార్, పీసీలు రమేష్‌నాయక్, రణధీర్‌గౌడ్, రమేష్, రామస్వామి, ఆరిఫ్, మహేందర్‌లను జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

కోతుల దాడిలో పత్తి పంట ధ్వంసం

కోనరావుపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన దొడ్డ చంద్రయ్య అనే రైతుకు చెందిన పత్తి పంట కోతులు దాడిచేసి ధ్వంసం చేశాయి. గ్రామ శివారులో ఉన్న పత్తి కాయలను తెంపి తిని పడేస్తూ ధ్వంసం చేశాయి. దీంతో 20గుంటల్లో పత్తి పంట ధ్వంసమైనట్లు తెలిపారు. కోతుల బెడద నుంచి పంటలను కాపాడాలని ప్రభుత్వాన్ని వేడుకున్నాడు.


ధ్వంసమైన పత్తి పంట

వర్షానికి తెగిన రోడ్డు


తెగిపోయిన రోడ్డు

రాయికల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజనగరం ఎస్సీకాలనీ నుంచి తండాకు వెళ్లే రోడ్డు ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కొట్టుకుపోయింది. దీంతో గ్రామస్థులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.

సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కేసు


ఫిర్యాదు చేస్తున్న నాయకులు

బోయినపల్లి సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్ నాయకుడిపై కేసు నమోదు చేసినట్లు బోయినపల్లి ఎస్సై రమాకాంత్ తెలిపారు. వివరాల ప్రకారం.. మండలంలోని మిడ్‌మానేరు వద్ద బీఆర్‌ఎస్ జిల్లా పార్టీఆధ్వర్యంలో జలభిషేకం నిర్వహించారు. గంభీరావుపేట మండలానికి చెందిన లక్కిరెడ్డి కమలాకర్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేశాడన్నారు. ఈ మేరకు కమలాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై విచారణ జరిపి కేసు నమోదు చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు కుస రవీందర్, మాజీ జడ్పీటీసీ పులి లక్ష్మీపతి గౌడ్, నాగుల వంశీ, జంగం అంజయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్సై రమాకాంత్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. మేరకు కమలాకర్ రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

సమయానికి బస్సు నడపాలని విద్యార్థుల ధర్నా


వెంకట్రావుపేటలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

భీమారం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సమయపాలన లేకుండా ఆర్టీసీ బస్సు నడుపుతున్నారని భీమారం మండలం వెంకట్రావుపేటలో విద్యార్థులు సోమవారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ సాయంత్రం రావాల్సిన బస్సు రాత్రి రావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆర్టీసీ బస్సు సమయానికి వచ్చేలా చూడాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ధర్మపురిలో భాగవత సప్తాహం ప్రారంభం


ప్రవచనాలు చేస్తున్న బ్రహ్మశ్రీ పురాణం మహేశ్వరశర్మ

ధర్మపురి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురిలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి అనుబంధ శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో భాగవత సప్తాహం కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మొదట భాగవత గ్రంథానికి పూజచేసిన అనంతరం మహేశ్వరశర్మ ప్రవచనాలు చేశారు. ఈ సందర్భంగా పురాణం మహేశ్వర్ శర్మను ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు కలిసి శాలువాకప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలమండలి చైర్మన్ జక్కురవీందర్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, అభిషేక్ పౌరోహితులు బొజ్జ రాజగోపాల్, శారదా మహిళా మండలి అధ్యక్షురాలు మధ్వాచారి విజయలక్ష్మి, కార్యదర్శి శోభ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనంతో ఢీకొట్టిన కేసులో ఒకరికి జైలు

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపడుతున్న కానిస్టేబుల్‌ను ఉద్దేశపూర్వకంగా ద్విచక్రవాహనంతో ఢీకొట్టిన కేసులో ఒకరికి నెల రోజుల జైలుశిక్షతో పాటు వెయ్యిరూపాయల జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్‌జడ్జి వెంకటమల్లిక్ సుబ్రహ్మణ్యశర్మ సోమవారం తీర్పునిచ్చారు. 2021 డిసెంబర్30న సారంగాపూర్ మండలం కోనాపూర్ గ్రామ శివారులో అనీఫొద్దీన్ అనే కానిస్టేబుల్ తోటిఉద్యోగులతో కలిసి డ్రంకెన్‌డ్రైవ్ వాహనతనిఖీల్లో పాల్గొన్నాడు. పెంబట్ల గ్రామానికి చెందిన సురేష్‌అనేవ్యక్తి ద్విచక్రవాహనాన్ని అతివేగంగా నడుపుతూ విధులు నిర్వహిస్తున్న అనీఫొద్దీన్ అనే కానిస్టేబుల్‌ను బలంగా ఢీకొట్టాడు. తీవ్రగాయాలైన కానిస్టేబుల్ ఫిర్యాదుమేరకు అప్పటి ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేశారు. కోర్టు కానిస్టేబుల్ సాక్ష్యులను ప్రవేశపెట్టగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నర్సయ్య కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి సురేష్‌కు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

చోరీ కేసుల్లో ఒకరికి జైలు శిక్ష

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో చోరీకి పాల్పడ్డ ఒకరికి ఐదు నెలల జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ ఫస్ట్ అడిషనల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీనిజ కోహిర్‌కార్ సోమవారం తీర్పునిచ్చారు. జిల్లాకేంద్రంలోని బీట్ బజార్ ప్రాంతంలోని ఓమెడికల్ షాప్‌తో పాటు మరోఇంటిలో 2020 సంవత్సరంలో కరణ్‌సింగ్ గగన్ అనేవ్యక్తి చోరీకి పాల్పడి నగదుతోపాటు విలువైన వస్తువులు అపహరించుకు వెళ్లాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి సీఐలు జయేష్‌రెడ్డి, వేణు గోపాల్‌లు కేసు నమోదు చేశారు. విచారణలో మహారాష్ట్రలోని కోత్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన కరణ్‌సింగ్ గగన్ అనేవ్యక్తి దొంగతనానికి పాల్పడ్డట్లు గుర్తించి రిమాండ్‌కు తరలించారు. కోర్టు హెడ్‌కానిస్టేబుల్ రాజేశ్వర్‌రావు సాక్ష్యులను ప్రవేశపెట్టగా అదనపు పీపీ రాజేష్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి కరణ్‌సింగ్‌కు జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

అధికారులు వేధిస్తున్నారని ఫైర్‌మన్ ఆత్మహత్యాయత్నం


ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న ఫైర్‌మన్ మనోహర్

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి ఫైర్ స్టేషన్‌లో ఫైర్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న జి మనోహర్ సోమవారం గడ్డిమందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఫైర్ స్టేషన్ అధికారులు డ్యూటీవిషయంలో తనను వేధింపులకు గురిచేస్తున్నారని సూసైడ్ లెటర్ రాశాడు. కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామానికి చెందిన మనోహర్ చొప్పదండి ఫైర్ స్టేషన్‌లో ఫైర్‌మన్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఫైర్‌స్టేషన్ అధికారులు పవన్, కిషన్ తన వ్యక్తిగత విషయాలను ప్రస్తావిస్తూ కించపరుస్తున్నారని, తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని లెటర్‌లో పేర్కొన్నాడు. ఈ ఇబ్బందుల కారణంగా తాను చనిపోవాలని నిర్ణయించుకున్నానని తెలిపాడు. అనంతరం కరీంనగర్ సమీపంలోని ఇరుకుల్ల వద్ద గడ్డిమందు తాగాడు. ఈ విషయాన్ని తన స్నేహితులకు ఫోన్ చేసి తెలిపాడు. స్నేహితులు, కుటుంబ సభ్యులు వెంటనే అక్కడికి చేరుకొని మనోహర్‌ను ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు మనోహర్ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసి, విచారణ జరుపుతున్నారు.


దిగువకు ప్రవహిస్తున్న ఎగువ మానేరు

కొనసాగుతున్న ఎగువ మానేరు పరవళ్లు

గంభీరావుపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు జలాశయం పరవళ్లు కొనసాగుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మానేరు ప్రాజెక్టు ఉప్పొంగింది. మానేరు అవుట్ ఫ్లో, ఇన్‌ఫ్లో 85వేల క్యూసెక్కుల వరకు వెళ్లి, ప్రస్తుతం 3,823 క్యూసెక్కులకు చేరింది. మానేరు ఉధృతి కారణంగా గంభీరావుపేట-లింగన్నపేట గ్రామాల మధ్య వాగులో వేసిన మట్టి రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది.

ఎంజేపీ పాఠశాల విద్యార్థినులకు వైద్య పరీక్షలు



హుజూరాబాద్ ఎంజేపీలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు

హుజూరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణం కేసీ క్యాంపులోని మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థినులను ఎలుకలు కరిచిన విషయంపై డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు ఆధ్వర్యంలో సోమవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. మూడ్రోజులుగా ఇద్దరు విద్యార్థునులను ఎలుకలు కరవగా, గుట్టుచప్పుడు కాకుండా ప్రిన్సిపాల్ వైద్యం చేయించారని ఆరోపణలున్నాయి. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థినుల తల్లిదండ్రులు గురుకుల పాఠశాల సిబ్బందిపై మండిపడ్డారు. విద్యార్థినుల తల్లిదండ్రులను లోపలికి రాకుండా పాఠశాల గేట్‌కు తాళం వేయడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈసందర్భంగా హాస్టల్‌లోని మిగితా విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. విషయం తెలుసుకున్న రిజినల్ కో-ఆర్డినేటర్ అంజలీదేవి, ఎంఈవో శ్రీనివాస్ హాస్టల్‌ను పరిశీలించి, విద్యార్థినులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంపై ఎంజేపీ పాఠశాలల రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ శ్యాంప్రసాద్‌లాల్, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆరా తీసినట్లు తెలిసింది.

స్వాతంత్ర్య సమరయోధుడు రాంపెల్లి కిష్టయ్య మృతి

- నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం


రాంపెల్లి కిష్టయ్య భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్డీవో

మంథని, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిజాంస్టేట్‌ను ఇండియన్ యూనియన్‌లో విలీనంకోసం సాగిన సాయుధపోరాటంలో పాల్గొన్న మంథనికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు రాంపెల్లి కిష్టయ్య(92) హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి మృతిచెందారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాయుధపోరాటం చేసిన మంథనికిచెందిన గొలుకోట శ్రీరాములు బృందంలో రాంపెల్లి కిష్టయ్య పాల్గొన్నారు. మహారాష్ట్రలోని చందా(చంద్రాపూర్)లో ఇండియన్ ఆర్మీ వద్ద కిష్టయ్య ఆయుధాల వినియోగం, యుద్ధంలో శిక్షణ పొందారు. అనంతరం వారి బృందం గోదావరినది పరివాహక ప్రాంతంలోని కాళేశ్వరం, దామెరకుంటలో నిజాం పోలీసుస్టేషన్లపై దాడి చేసింది. నిజాంపాలనకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతులను చేశారు. అనేకపోరాటాల తర్వాత ఇండియన్ యూనియన్‌లో నిజాంస్టేట్ విలీనమైంది. అనంతరం రాంపెల్లి కిష్టయ్య టీచర్‌గా, హెచ్‌ఎంగా పనిచేసి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఇన్ స్కూల్స్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. మాజీగవర్నర్ తమిళిసై సౌందరరాజన్, రాష్ట్రఐటీశాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కిష్టయ్యను సన్మానించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా అనేక పురస్కారాలు, సత్కారాలు అందుకున్నారు. వృద్ధాప్యం, అనారోగ్య కారణంగా హైదరాబాద్‌లో ఉంటున్న రాంపెల్లి కిష్టయ్య తుదిశ్వాస విడిచారు. మంథనిలో ఆయన నివాసానికి పార్థివ దేహాన్ని తీసుకువచ్చి జాతీయ జెండాను కప్పారు. మంథని ఆర్డీవో సురేష్, తహసీల్దార్ కుమారస్వామి, ఈఆర్‌సీ మెంబర్ శశిభూషణ్ కాచేతోపాటు పలువురు నివాళులర్పించారు. మంథని గోదావరినది తీరంలో అంత్యక్రియలు నిర్వహించారు.

- **రాంపెల్లి కిష్టయ్య మృతి చాలా బాధాకరం**
- **రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**

నిజాం పాలకు వ్యతిరేకంగా సాయుధంగా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడు రాంపెల్లి కిష్టయ్య మృతి బాధాకరమని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుటుంబ సభ్యులకు తన సానుభూతిని ప్రకటించారు.

హరీశ్‌రావు, సంతోష్‌రావు

అవినీతి అనకొండలు

(మొదటిపేజీ తరువాయి)



మీడియా మిత్రులతో రకరకాలుగా చెప్పించారు. సోషల్ మీడియా ద్వారా ఇప్పటివరకు నాపై జరిగిన పర్సనల్ ఎటాక్‌ను ఓర్చుకుంటూ వచ్చాను. ఇంతవరకు పేరు పెట్టి చెప్పలేదు. ఇప్పుడు మొదటిసారి చెబుతున్నా. దేవుడి లాంటి మా నాన్నపై సీబీఐ విచారణ చేస్తామంటుంటే.. ఒక బిడ్డగా కడుపు రగిలిపోతోంది. అందుకే చెబుతున్నా" అని అన్నారు.

ఇంకా వాళ్లనే మోస్తారా?

"హరీశ్‌రావు, సంతోష్.. కేసీఆర్ పక్కన ఉండి, ఆయన పేరు చెప్పుకొని అనేక విధాలుగా లబ్ధి పొందారని కవిత తెలిపారు. వారి చర్యల వల్లే కేసీఆర్ పేరు బద్నామ్ అయ్యే పరిస్థితి వచ్చింది. అయినా వాళ్లనే మోస్తామని, వాళ్లనే మళ్లీ ముందుకు తీసుకెళ్తామని అనుకుంటే.. పార్టీ ఎలా ముందుకుపోతుందని ప్రశ్నించారు. "ఒక బిడ్డగా నేను బాధపడుతున్నా. ఐదేళ్లు ఇరిగేషన్ మంత్రిగా చేసిన హరీశ్‌రావుకు ఇందులో మేజర్ పాత్ర లేదా? మా నాన్న పరిస్థితి నేను దగ్గరుండి చూశాను. నా పెళ్లికి డబ్బుల కోసం ఆయన ఎంత ఇబ్బంది పడ్డారో నాకు తెలుసు. రాజకీయాల్లో 40, 50 ఏళ్లు ఉన్నా.. కేసీఆర్ ఆస్తులు సంపాదించుకోలేదు. నాకు తెలిసి ఆయనకు డబ్బుపై ఎన్నడూ ఆశలేదు. అలాంటి వ్యక్తిపై సీబీఐ విచారణ చేస్తామని, కేసులు వేస్తామని అంటే.. ఇందుకు ఎవరు కారణం? ఈ వయసులో ఆయనపై సీబీఐ కేసులేంటి? ఏం ఖర్మ? ఇలాంటి వాళ్లను ఎందుకు భరించాలి? ఎందుకు ప్రొటెక్ట్ చేయాలి? బీఆర్ఎస్ తమ్ముళ్లకు నాపై కోపం రావచ్చు. వాస్తవాలు చేదుగా ఉన్నా.. మందులాగా అప్పుడప్పుడు మాట్లాడితేనే ఆరోగ్యంగా ఉంటుంది" అని కవిత వ్యాఖ్యానించారు.

హరీశ్, సంతోష్ వెనక రేవంత్‌రెడ్డి..

కాంగ్రెస్ ప్రభుత్వం చేతకాని ప్రభుత్వమని కవిత మండిపడ్డారు. ఏసీబీ మగ్గురు కాళేశ్వరం ఇంజనీర్లను పట్టుకుంటే, ఒక్కో ఇంజనీరు దగ్గర వందల కోట్ల ఆస్తులు బహిర్గతమైతే.. విచారణ చేసే దమ్ము ప్రభుత్వానికి లేకుండాపోయిందని ధ్వజమెత్తారు. వారి వెనకాల ఎవరున్నారని ప్రశ్నించారు. "హరీశ్‌రావు, సంతోష్‌రావు వెనక రేవంత్‌రెడ్డి ఉండి కాపాడుతున్నారు. బాణం గురి ఎంతసేపూ కేసీఆర్‌పైనే ఉంది. అందుకే అన్ని విషయాల్లో వాళ్లను ఏమీ అనరు. వాళ్ల గురించి మాట్లాడరు. ఈ అవినీతి అనకొండలతో రేవంత్‌కు ఉన్న రహస్య ఒప్పందం బహిర్గతం కావాలి. పీసీ ఘోష్ కమిషన్ నివేదికలో ఏముందో చెప్పకుండానే టక్కున సీబీఐకి ఇస్తామనడం ముందస్తు కుట్ర. కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీయడమే వారి లక్ష్యం. మీరు బట్టకాల్చి మీదవేసినట్లు ఆరోపణలు చేయడం కాదు. నేను డిమాండ్ చేస్తున్నా.. పేర్లు కూడా చెప్పాను. దమ్ము ధైర్యం ఉంటే వారిపై విచారణ చేయించాలి. వాస్తవాలు బయటపెట్టి వారితో అండర్‌స్టాండింగ్ లేదని నిరూపించుకోవాలి" అని కవిత సవాల్ చేశారు.

ఎవరో చెబితే ఆడే తోలుబొమ్మను కాదు..!

తాను తన తండ్రికి రాసిన లేఖను లీక్ చేసిన సందర్భంలో అసలు విషయాలు బహిర్గతం చేసినందుకు 90 రోజులుగా తనను దుష్ప్రచారాలతో వేధిస్తున్నారని కవిత తెలిపారు. ఇప్పుడు కాళేశ్వరం విషయంలో వాస్తవాలు మాట్లాడినందుకూ వాళ్ల సోషల్ మీడియా బ్యాచ్‌లు రేపటి నుంచి అడ్డగోలు విమర్శలు చేస్తాయన్నారు. "నన్ను బీజేపీ ఆపరేట్ చేస్తుందంటారు. కాంగ్రెస్ ఆపరేట్ చేస్తుందంటారు. ఒకరు రేవంత్‌రెడ్డి చెబితే మాట్లాడుతుందని, మరొకరు బండి సంజయ్ చెబితే మాట్లాడుతుందంటూ దుష్ప్రచారం చేస్తారు. ఖబడ్దార్ బిడ్డా.. నేను ఎవరో చెబితే ఆడే తోలుబొమ్మను కాదు. నాది కేసీఆర్ రక్తం.. తెలంగాణ బ్లడ్. వ్యక్తిగతంగా నేను అనుకున్న విషయాన్ని చెబుతున్నా. దానికి రాజకీయంగా ఇబ్బంది అయినా, నష్టమయినా, కష్టమయినా.. నేనే భరిస్తా" కవిత స్పష్టం చేశారు.

ఇలాంటి పార్టీ ఉంటే ఏంది? పోతే ఏంది?

దేశంలో ఎక్కడికి వెళ్లినా.. కేసీఆర్ మహానాయకుడు అంటారని కవిత తెలిపారు. ఇప్పుడు సీబీఐ విచారణ జరిపితే.. ఏం మాట్లాడతారని ప్రశ్నించారు. "మా నాన్న పరువు పోతే నాకు బాధ. మీకా? వాళ్లకు పైసలు కావాలె. పేరుతో ఏం పని? ఇంక కూడా ఇటువంటి విషయాలు అర్థం చేసుకోకుండా, ఇలాంటి వ్యక్తులను దూరం పెట్టకుంటే.. ఇలాంటి పార్టీ ఉంటే ఏంది? పోతే ఏంది? బీఆర్ఎస్ నాయకులు నన్ను తిట్టుకున్నా సరే. స్థానిక ఎన్నికల్లో నష్టం జరుగుతదని అనుకున్నా సరే. మా నాన్నమీద సీబీఐ విచారణ పడ్డాక ఏముంది? ఎలక్షన్‌లో ఒకరు గెలుస్తరు, ఒకరు ఓడిపోతరు. అసలు పార్టీ ఓడిపోయే పరిస్థితి ఎందుకు వచ్చింది? ఇటువంటి దుర్మార్గుల వల్ల కాదా? ఊ అంటే.. మా దగ్గర పైసలున్నయని, టీవీలున్నయని, సోషల్ మీడియాలుయని ఎటు పడితే అటు మాట్లాడతామంటే తోలు తీస్తం. గీత గీసుకుంటం బిడ్డా. మీరు ఒక కామెంట్ పెడితే.. మేం పది పెడతాం. ఇంతకాలం చూస్తూ ఊరుకున్నా. పెద్ద సారు దగ్గరికి వచ్చాక ఇక కాంప్రమైజ్ అయ్యేది లేదు. నిజంగానే ఆయన అవినీతికి పాల్పడితే వేరుమాట. కేసీఆర్‌కు ఎప్పుడూ తెలంగాణ ధ్యాసే.. అదే పిచ్చి. అలాంటి వ్యక్తిపై ఏది పడితే అది మాట్లాడితే.. రియాక్ట్ కాకపోవడం చాలా దారుణం. సీబీఐ విచారణ చేస్తున్నామని రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటిస్తే.. తెలంగాణ బంద్‌కు పిలుపు ఇవ్వొద్దా? తెలంగాణ భగ్గుమనొద్దా? దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. ఏదేమైనా సీబీఐ విచారణ చేసినా.. కేసీఆర్ కడిగిన ముత్యంలా బయటకు వస్తారు" కవిత పేర్కొన్నారు.

మూడు పిల్లర్లు కుంగిపోతే రెండున్నరేళ్లుగా లొల్లి!

కేసీఆర్ తరతరాలకు తరగని ఆస్తిలా కట్టిన కాళేశ్వరాన్ని బద్నామ్ చేస్తున్నారని కవిత అన్నారు. "మహాసముద్రం లాంటి కాళేశ్వరంలో చిన్న పార్ట్ అయిన మేడిగడ్డలో మూడు పిల్లర్లు కుంగిపోతే.. ప్రాజెక్టు మొత్తం కూలిపోయిందని రెండున్నరేళ్లుగా లొల్లి పెడుతున్నారు. నేను 2006 నుంచి తెలంగాణ ఉద్యమంలో పాల్గొంటూ రాజకీయాల్లో యాక్టివ్‌గా ఉన్నాను. అప్పటినుంచి ఇప్పటివరకు ప్రజల విషయం తప్ప.. వ్యక్తిగత విషయాలు మాట్లాడరు. అటువంటి మహానాయకుడు అవినీతికి పాల్పడ్డారని, లక్ష కోట్లు దోచుకున్నారని, నిజాం కన్నా ధనికుడు కావాలనుకున్నారని అంటున్నారు. అవును కచ్చితంగా నిజాం బాటలోనే నడుస్తాం. నిజాం కట్టిన ఉస్మాన్‌సాగర్ నీళ్లే కదా.. నేటికీ హైదరాబాద్ ప్రజలు తాగుతున్నది! ఆ నిజాం స్ఫూర్తి అని మా నాన్న చాలాసార్లు చెప్పారు. కచ్చితంగా 200 ఏళ్లు తెలంగాణ ప్రజలు కాళేశ్వరం ప్రాజెక్టును కట్టిన కేసీఆర్‌ను తలుచుకుంటారు. కేసీఆర్‌కు ఉన్న అవగాహన, ఉమ్మడి ఏపీలో ఆయన అనుభవించిన వివక్ష, తెలంగాణకు వ్యతిరేకంగా పనిచేసిన ప్రస్తుత సీఎంకు తెలియదు. నేటికీ ఆయన పక్క రాష్ట్రం ఎజెండాను అమలు చేస్తున్న వ్యక్తి. బనకచర్ల కడతామంటే మాట్లాడని వ్యక్తి.. కేసీఆర్ గురించి అసెంబ్లీలో ఉదయం నుంచి రాత్రి వరకు అనరాని మాటలు అంటుంటే నా గుండె బరువెక్కింది. ఇదే రేవంత్‌రెడ్డి గతంలో ఓ టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, 'కేసీఆర్‌కు పైసల మీద ఆశలేదు. పాపం ఆయన మీటింగ్ పెట్టాలంటే కూడా.. అప్పుడు పైసల గురించి చూస్తారు' అన్నారు. అటువంటి ఆలోచన ఉన్న వ్యక్తిమీద ఇంత కుట్రపూరితంగా అభాండాలు ఎందుకు వేస్తున్నారు? ప్రజలు తిరగబడతారనుకుంటే.. ప్రభుత్వం తప్పులు బయటపడతాయంటే.. కేసీఆర్‌పై ఆరోపణ చేయాలి. ఆయన పేరు చెప్పకుంటే రేవంత్‌రెడ్డి ఫొటో కూడా పేపర్లో వేయరని ఆయన్ను విమర్శిస్తున్నారు. సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు పెడతామని, 50శాతం రిజర్వేషన్లు ఎత్తేస్తామని అంటున్నారు. రాహుల్‌గాంధీ బిహార్ ఎన్నికల ప్రచారం కోసం బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ రోజుకో కొత్తకథ చెబుతోంది. గవర్నర్ వద్ద పెండింగ్ పెడితే.. సుప్రీంకోర్టుకు ఎందుకు వెళ్లడంలేదు? బిహార్ ఎన్నికల కోసమే బీసీ బిడ్డలను రేవంత్‌రెడ్డి బలి పెడుతున్నారు. ఇలాగే చేస్తే.. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బిహార్‌కు వెళ్లి ప్రచారం చేస్తాం" అని కవిత హెచ్చరించారు.

కవిత

సస్పెన్షన్ ఖాయం!?

నేడో, రేపో బీఆర్ఎస్ నుంచి ప్రకటన!.. కీలక నేతలతో అధినేత కేసీఆర్ భేటీ

- ఉపేక్షిస్తే పార్టీకి మరింత నష్టం అనే అభిప్రాయం
- ఎక్స్‌లో కవితను అన్‌ఫాలో చేయాలని ఆదేశం
- బీఆర్ఎస్ఎల్పీ వాట్సప్ గ్రూప్ నుంచి కవిత పీఆర్వో అవుట్
- సస్పెండైతే తెలంగాణ జాగృతి పేరుతో కవిత సొంత పార్టీ?



హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సొంత పార్టీకి చెందిన నేతలు హరీశ్‌రావు, జోగినపల్లి సంతోష్ కుమార్‌పై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. కవిత తీరుతో పార్టీకి మరింత నష్టం జరిగేలోపే ఆమెను బీఆర్ఎస్ నుంచి సాగనంపాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో పార్టీ నుంచి కవిత సస్పెన్షన్ ఖాయం అనే ప్రచారం బీఆర్ఎస్ వర్గాల్లో జోరుగా సాగుతోంది. దీనిపై ఒక ట్రెండు రోజుల్లో బీఆర్ఎస్ నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మీడియా సమావేశంలో హరీశ్, సంతోష్‌పై కవిత సంచలన వ్యాఖ్యలు చేశాక.. ఆ పార్టీ సీనియర్ నేతలు ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు వెళ్లారు. అక్కడ కేటీఆర్, వేముల ప్రశాంత్ రెడ్డి, జగదీశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డితో పాటు మరికొందరు కీలకనేతలు కేసీఆర్‌తో భేటీ అయ్యారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలపై కేసీఆర్‌తో మంతనాలు జరిపారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కవిత పార్టీలో ఉంటే లాభం ఉందా? అంటూ పార్టీ నేతలను కేసీఆర్ ప్రశ్నించారు. ఇంత పెద్ద వ్యాఖ్యలు చేశాక కూడా కవితను కొనసాగిస్తే పార్టీకి మరింత నష్టం అని, ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని మెజారిటీ నేతలు కేసీఆర్‌కు సూచించారు. కవితను పార్టీలో కొనసాగితే విపక్షాలకు ఆయుధం ఇచ్చినట్లేనని నేతలు అభిప్రాయపడ్డారు. కవితపై ఎటువంటి చర్యలు తీసుకోకపోతే మున్ముందు మరింత నష్టం జరిగే ప్రమాదం ఉందని అధినేతకు చెప్పారు. కవిత ఇదివరకే.. కేసీఆర్ చుట్టూ దయ్యాలున్నాయంటూ వ్యాఖ్యానించారు. అప్పుడే ఆమెపై నిర్ణయం తీసుకుంటారని అంతా భావించారు. అయితే ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోకుంటేనే తక్కువ నష్టం జరుగుతుందనే భావన అప్పట్లో పార్టీ పెద్దల్లో ఉండిందని.. ఇప్పుడు చేయిదాటిపోయే స్థాయికి పరిస్థితి చేరిందని ఓ కీలక నేత చెప్పారు.

కవితపై బీఆర్ఎస్ నేతల మాటల దాడి

సామాజిక మాధ్యమాల్లో కవితను వెంటనే అన్‌ఫాలో కావాలని బీఆర్ఎస్ ఐటీ విభాగం నుంచి పార్టీ శ్రేణులకు ఆదేశాలు వెళ్లినట్లు గులాబీ వర్గాలు చెబుతున్నాయి. ఆ వెంటనే ఎక్స్ ఖాతాలో కవితను ఫాలో అవుతున్న కార్యకర్తలు వెంటవెంటనే అన్‌ఫాలో అయ్యారు. సామాజిక మాధ్యమాల్లో ఆమెకు వ్యతిరేకంగా కామెంట్లు పెట్టడం మొదలుపెట్టారు. ఎలక్ట్రానిక్ మీడియాలో బీఆర్ఎస్ తరఫున చర్చలకు వెళ్లిన నేతలు కూడా కవిత తీరును తీవ్రంగా తప్పుబట్టారు. కొందరైతే కవిత తీరు వల్లే గత ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయం పాలైందని ఆరోపించారు. మరికొందరు తక్షణమే ఆమె పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ఎల్పీ వాట్సప్ గ్రూప్ నుంచి కవిత పీఆర్వోను తొలగించారు. హరీశ్‌రావు ఆరడుగుల బుల్లెట్ అంటూ బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగం పోస్టులు పెట్టింది. లండన్ పర్యటనలో ఉన్న హరీశ్‌రావుకు అక్కడి బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం ఘనస్వాగతం పలికింది.

సస్పెండ్ చేస్తే సొంతపార్టీ?

బీఆర్ఎస్ నుంచి కవితను సస్పెండ్ చేస్తే ఆమె అడుగులు ఎటువైపు? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. అయితే మొదట్నుంచి ఆమె ఒక స్పష్టతతో ఉన్నారని, పార్టీ నుంచి బయటకు వెళ్లాల్సివస్తే, సొంత వేదిక ఏర్పాటు చేసుకోవాలని ముందే నిర్ణయం తీసుకున్నారని విశ్లేషకులు అంటున్నారు. 2023 ఎన్నికల్లో పార్టీ పరాజయం పాలైనప్పటి నుంచి ఆమె తన జాగృతి సంస్థను నెమ్మదిగా బలోపేతం చేస్తూ వస్తున్నారు. జాగృతి పేరుతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పార్టీ పెడితే తెలంగాణ జాగృతినే పార్టీ పేరుగా ఖరారు చేసే అవకాశం ఉందని ఆమె సన్నిహితులు చెబుతున్నారు. కొత్త పేరు జోలికి వెళ్లకపోవచ్చని ఆ వర్గాలు అంటున్నాయి.

రిజిస్టర్ పోస్టుకు సెలవు

స్పీడ్ పోస్టులో విలీనం



భగత్‌నగర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రిజిస్టర్ పోస్టు సేవలకు తపాలా శాఖ సెలవు పలికింది. సెప్టెంబరు 1 నుంచి రిజిష్టర్ పోస్టును స్పీడ్ పోస్టులో విలీనం చేస్తూ కీలకనిర్ణయం తీసుకుంది. పెరిగిపోతున్న సాంకేతిక తను తపాల శాఖఅందింపుచ్చుకుని తపాల సేవల్లో పలు మార్పులను తీసుకు వచ్చింది.

తపాలా సేవల్లో మార్పులు

పెరిగిపోతున్న సాంకేతికను తపాల శాఖ అందిపుచ్చుకుని తపాలా సేవల్లో పలు మార్పులు వచ్చాయి. ఒక నాడు ఉత్తరాల బట్వాడాకు, మనీ ఆర్డర్లు పంపేందుకు, పొదుపు పథకాలు అందిచేందుకు ప్రధాన కేంద్రాలుగా పోస్టాఫీసులు ఉండేవి. నేడు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లు సేకరిస్తూ, బీమాపాలసీలు అందిస్తూ బ్యాంకులుగా రూపాంతరం చెందాయి. ప్రజలు అందివచ్చిన టెక్నాలజీకి అలవాటు పడ్డారు. సెల్‌ఫోన్ల వినియోగం పెరగడంతో ఉత్తరాలు కనుమరుగయ్యాయి. పార్సిళ్లు వంటివి పంపాలంటే ప్రైవేట్ కొరియర్ సంస్థలు అందుబాటులోకి వచ్చాయి.

కనుమరుగుకానున్న పోస్ట్ బాక్స్‌లు

పోస్టల్ శాఖలో రిజిస్టర్ పోస్టుది సుదీర్ఘ చరిత్ర. 1854 సంవత్సరంలో బ్రిటిష్ కాలంలో మన దేశంలోకి ప్రవేశపెట్టిన పోస్టుబాక్సులు ఇకపై కనుమరుగుకానున్నాయి. బంధువులు, స్నేహితులకు రాసిన ఉత్తరాలు, గ్రీటింగ్ కార్డ్స్ అభిమాన రచయితలు, సినీతారలకు రాసిన లెటర్స్‌తో పాటు ఊరు పేరు లేకుండా రాసే ఆకాశరామన్న ఉత్తరాలు పోస్టుబాక్సుల్లో వేస్తే అవి చేరాల్సిన చోటుకు చేరేవి. పెరుగుతన్న టెక్నాలజీని దృష్టిలో పెట్టుకుని ఖర్చులు తగ్గించుకునే చర్యలో భాగంగా పోస్టుబాక్సులు తొలగించనున్నారు. కొంత కాలంగా ఇంటర్నెట్, డిజిటల్ కమ్యూనికేషన్ల వల్ల సాధారణ రిజిస్టర్ పోస్టులు, పోస్టు బాక్సుల ఉపయోగం గణనీయంగా తగ్గిపోయింది. దీంతో దేశ్యాప్తంగా సెప్టెంబరు 1 నుంచి రిజిష్టర్ పోస్టు సేవలు నిలిపివేశారు. ట్రాకింగ్‌లో కచ్చితత్వాన్ని, డెలివరీ వేగాన్ని, ఆపరేషనల్ ఎఫిషియన్సీని మెరుగుపర్చాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తపాలా శాఖ అధికారులు తెలిపారు.

7న ఆలయాలు మూసివేత

ధర్మపురి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి, అనుబంధ ఆలయాలు ఈనెల 7న చంద్రగ్రహణం సందర్భంగా మూసి వేస్తామని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామి వారలకు నివేదన అనంతరం ఒంటి గంటకు ఆలయాలు మూసి వేసి సోమవారం ఉదయం 5 గంటలకు తెరవడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఆలయాల్లో సంప్రోక్షణ, గ్రహణ శాంతి, హోమం, అభిషేకం అనంతరం ఉదయం 9.30 గంటలకు భక్తులకు దర్శనం ప్రారంభించడం జరుగుతుందని ఆయన తెలిపారు.



ఉత్తర తెలంగాణకు ప్రాణవాయువు

శ్రీపాద ఎల్లంపల్లి

కాళేశ్వరం అవసరం లేకుండానే నీటి ఎత్తిపోతలు

- గతేడాది 24.193 టీఎంసీలు, ఈ ఏడాది 7.197 టీఎంసీలు
- ప్రత్యామ్నాయం తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మిస్తే తగ్గనున్న విద్యుత్ బిల్లుల భారం



పెద్దపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు గోదావరి జలాలను ఎత్తిపోసేందుకు ప్రాణవాయువుగా మారింది. ఉత్తర తెలంగాణలోని 13 జిల్లాల్లోని సాగు భూములను సస్యశ్యామలం చేసేందుకు జంక్షన్‌గా నిలిచింది. గత ఏడాది ఎన్‌డీఎస్ఏ నిపుణుల సూచనల మేరకు కాళేశ్వరం బ్యారేజీలను ఓపెన్ ఫ్రీగా పెట్టగా, అక్కడి నుంచి నీటిని ఎత్తి పోయకుండానే గతేడాది రెండు పంటలు సాగయ్యాయి. ఈ ఏడాది ప్రాజెక్టులోకి వస్తున్న వరద నీటిని అవసరం మేరకు మిడ్ మానేరుకు తరలిస్తున్నారు. శ్రీపాద ఎల్లంపల్లికి ఈ ఏడాది జూన్ 1వ తేదీ నాటికి ప్రాజెక్టు నీటిమట్టం 20.175 టీఎంసీలకుగాను, 8.593 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

అప్పటి నుంచి శనివారం ఉదయం వరకు ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టులు, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 256 టీఎంసీల వరద నీరు వచ్చింది. ఇక్కడి నుంచి నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల మీదుగా 7.197 టీఎంసీల నీటిని మిడ్ మానేరుకు తరలించారు. 244.43 టీఎంసీల నీటిని గోదావరిలోకి గేట్ల ద్వారా వదిలి పెట్టారు. ఎస్సారెస్పీ, మిడ్‌మానేరు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతోపాటు ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా, ఎల్లంపల్లి నుంచి వచ్చిన నీళ్ల ద్వారా 24 టీఎంసీలకు చేరుకున్నది. ఇక్కడి నుంచి రంగనాయకసాగర్‌కు, ఎల్ఎండీలకు నీటిని ఎత్తిపోస్తున్నారు. మిడ్ మానేరుకు వరద నీరు, ఎస్సారెస్పీ నీళ్లు వస్తుండడంతో మూడు రోజుల క్రితమే మోటార్లను ఆపేసి ఎత్తిపోతలను నిలిపి వేశారు. గతేడాది శ్రీపాద ఎల్లంపల్లికి 303 టీఎంసీల వరకు వరద రాగా, 24.193 టీఎంసీల నీటిని నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల మీదుగా మిడ్ మానేరుకు తరలించారు. దిగువకు గోదావరిలోకి 278.24 టీఎంసీల నీటిని వదిలిపెట్టారు. ఈ ఏడాది కూడా కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నుంచి నీటిని ఎత్తిపోయకుండానే అన్ని ప్రాజెక్టులు, రిజర్వాయర్ల కింద ప్రస్తుత యాసంగి సీజన్‌లో పంటలు పండించేందుకు ఢోకా లేకుండా పోయింది.

● తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీని నిర్మిస్తేనే మేలు..

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించిన మేరకు తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీని నిర్మించడం వల్ల కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోయాల్సిన అవసరం ఉండదు. ప్రభుత్వానికి విద్యుత్ బిల్లులు ఆదా కానున్నాయి. తుమ్మిడిహెట్టి నుంచి గ్రావిటీ ద్వారా సముద్రమట్టానికి 143 అడుగుల ఎత్తులో ఉన్న శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ప్రాణహితకు వచ్చిన వరదను వచ్చినట్లే తరలించవచ్చు. గతంలోనే తుమ్మిడిహెట్టి నుంచి మైలారం వరకు కాలువల నిర్మాణాలు పూర్తయ్యాయి. సముద్రమట్టానికి 152 అడుగుల ఎత్తులో తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించాలని ప్రతిపాదించినప్పటికీ, మహారాష్ట్రలో ముంపు ఎక్కువగా ఉండడంతో అందుకు అప్పటి ప్రభుత్వం అంగీకరించ లేదు. తెలంగాణ వచ్చిన తర్వాత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తుమ్మిడిహెట్టి వద్ద 148 అడుగులు, మేడిగడ్డ వద్ద 100 అడుగుల ఎత్తులో బ్యారేజీ నిర్మాణాలు చేపట్టేందుకు మహారాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నారు.

ప్రస్తుతం కాళేశ్వరం బ్యారేజీలు కుంగినందున ప్రత్యామ్నాయంగా తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీని నిర్మిస్తేనే రైతాంగానికి మేలు జరగనున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 2 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించే వీలు ఉంటుంది. దీనికి తోడు పెద్దపల్లి జిల్లాలోని ధర్మారం మండలం పత్తిపాక వద్ద ప్రతిపాదించిన శ్రీలక్ష్మీ నర్సింహా రిజర్వాయర్ డీపీఆర్ తయారీకి ఆదేశించిన ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపడితే పెద్దపల్లి, జగిత్యాల, కరీంనగర్ జిల్లాల్లో ఎస్సారెస్పీ కింద గల 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు భూములను స్థిరీకరించడంతో పాటు, నీటి నిల్వ కూడా చేసుకునే వెసలుబాటు ఉంటుంది. సుందిళ్ల బ్యారేజీ నిర్మాణంలో గల లోపాలను గుర్తించి దానికి మరమ్మతు చేసి డీపీఆర్ లో ప్రతిపాదించిన మేరకు మంథని నియోజకవర్గానికి 30 వేల ఎకరాలకు, చెన్నూర్ నియోజకవర్గంలోని 25 వేల ఎకరాలకు సాగు నీటిని ఇవ్వవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సీజన్ ప్రారంభం, చివరలోనే ఉపయోగం..

కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఎత్తి పోసిన నీళ్లు వానాకాలం సీజన్ ప్రారంభంలో, ఆ తర్వాత వేసవి కాలంలో పంటలు చేతికి వచ్చే సమయంలో ఉపయోగపడ్డాయి. గోదావరి తీర ప్రాంతంలో యేటా భారీ వర్షాలు జూలై నెలాఖరులో ఆరంభమై ఆగస్టు, సెప్టెంబర్ వరకు కురుస్తాయి. ఈ క్రమంలో జూన్, జూలై మొదటి వారంలో కాళేశ్వరం ప్రాజెక్టులోకి నీటిని ఎత్తుపోశారు. వర్షాల పరిస్థితిని అంచనా వేస్తూ నీటిని ఎత్తిపోశారు. ప్రాజెక్టు డీపీఆర్ ప్రకారం కాళేశ్వరం ప్రాజెక్టు ఆరంభించిన నాటి నుంచి 160 టీఎంసీల నీటిని ఎత్తిపోసిన దాఖలాలు లేవు. నాలుగేళ్లలో మొత్తం 163 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. కాళేశ్వరంతో సంబంధం లేకుండా గతేడాది 24.193 టీఎంసీలు, ఈ ఏడాది ఇప్పటి వరకు 7.197 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. ఎస్సారెస్పీ ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలతో ఎస్సారెస్పీ నిండుతుండగా, అవసరాన్ని బట్టి వరద కాలువ ద్వారా మిడ్ మానేరుకు, ఎల్ఎండీకి నీటిని విడుదల చేస్తున్నారు. మిడ్ మానేరు, ఎల్ఎండీల ఎగువ ప్రాంతాల్లో కురిసే వర్షాల వల్ల కూడా కొంత నీరు వస్తున్నది. వీటికి తోడు ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరుకు ఉపయోగపడుతున్నాయి.



● కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నాలుగేళ్లలో 163 టీఎంసీలు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాణహిత- చేవేళ్ల ప్రాజెక్టుకు 2009లో శ్రీకారం చుట్టారు. ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీని నిర్మించి 160 టీఎంసీలను ఎత్తిపోసి 16.40 లక్షల కొత్త ఆయకట్టుకు సాగునీటిని అందించాలని తలపెట్టారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం 36,500 కోట్లు కాగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యే నాటికి 1500 కోట్ల రూపాయలు వెచ్చించి ఆయా ప్రాంతాల్లో సొరంగ మార్గాలు, కాలువల నిర్మాణాలు చేపట్టారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాణహిత- చేవేళ్లకు ప్రాజెక్టుకు రీ డిజైన్ చేసి కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టారు. ఈ ప్రాజెక్టు ద్వారా యేటా 160 టీఎంసీల నీటిని మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ వరకు ఎత్తి పోసి 18,25,700 ఎకరాల కొత్త ఆయకట్టుకు, 18,82,970 ఎకరాల భూములను స్థిరీకరించేందుకు 2016 మే 2న కాళేశ్వరం ప్రాజెక్టు పనులకు మేడిగడ్డ వద్ద శ్రీకారం చుట్టారు. గోదావరి నదిపై మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద బ్యారేజీలు, మూడు పంప్‌హౌస్‌లు నిర్మించారు. 2019 జూన్ 21న మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ సీఎంలతో కలిసి ప్రాజెక్టును ఆరంభించి జాతికి అంకితం చేశారు.

అదే ఏడాది ఆగస్టు 5వ తేదీ వరకు క్రమంగా మూడు పంప్‌హౌస్‌ల ద్వారా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటిని ఎత్తిపోశారు. 2019-20లో 53 టీఎంసీలు, 2020-21లో 48 టీఎంసీలు, 2021- 22లో 33 టీఎంసీలు, 2023లో 26 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. అదే ఏడాది అక్టోబర్‌లో మేడిగడ్డ బ్యారేజీకి చెందిన రెండు పియర్లు కుంగిపోయాయి. అన్నారం బ్యారేజీకి బుంగ పడింది. సుందిళ్ల బ్యారేజీలు స్వీపేజీలు ఏర్పడ్డాయి. దీంతో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారులు వాటిని పరిశీలించి ఓపెన్ ఫ్రీ బ్యారేజీలుగా ఉంచాలని సూచించారు. ఆ మేరకు ప్రభుత్వం గతేడాది నుంచి నీటిని నిల్వ చేయడం లేదు. 2019 నుంచి 20 23 వరకు నాలుగేళ్లలో 163 టీఎంసీల నీటిని ఎత్తిపోసినప్పటికీ, ఎల్లంపల్లి నుంచి దిగువకు గోదావరిలోకి 1165 టీఎంసీల నీటిని వదిలిపెట్టారు.

శ్రీరాంసాగర్‌కు 1.30 లక్షల క్యూసెక్కుల వరద

జగిత్యాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి సోమవారం వరద నీరు రావడం కొనసాగింది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 1,30,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా 25 గేట్లు పైకి ఎత్తి 1,00,000 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరికి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 టీఎంసీల సామర్థ్యానికి ప్రస్తుతం 76.984 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న నీటి ప్రవాహం కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి నీటిని వదులుతున్నందున నదీ పరిసర ప్రాంతాల్లోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్ ఫ్లో

బోయినపల్లి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీ రాజరాజేశ్వర జలాశయనికి (మిడ్ మానేరు) ఇన్ ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టుకు ఆదివారం 14,800 క్యూ సెక్కుల వరద నీరు వస్తోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 317.35 మీటర్లు ఉన్నది. నిల్వ సామర్థ్యం 27.888 టీఎంసీలకు 25.527 టీఎంసీల నీరు ఉన్నది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోతలు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) ఇల్లంతకుంట మండలం అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు నాలుగు పంపుల ద్వారా కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.82టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు ద్వారా 12,800క్యూసెక్కుల నీరు వస్తుండగా ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 9,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఎల్ఎండీకి స్వల్పంగా ఇన్‌ఫ్లో



కళకళలాడుతున్న ఎల్ఎండీ

తిమ్మాపూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి స్వల్పంగా ఇన్‌ఫ్లో వస్తోంది. ఎగువ కాకతీయ కాలువ నుంచి 2వేల క్యూసెక్కులు, మోయతుమ్మెద వాగు నుంచి 1148 క్యూసెక్కుల నీరు మొ త్తంగా 3148 క్యూసెక్కుల నీటి ఇన్‌ఫ్లో ఎల్ఎండీలోకి వస్తోం ది. ఎల్ఎండీ పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 21.505 టీఎంసీల నీటి నిల్వ ఉంది. మిషన్ భగీరథ, ఇతర అవసరాల కోసం 301 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు.

శోభాయాత్రలో డీజేలకు అనుమతి లేదు : ఎస్పీ

సిరిసిల్ల క్రైం, సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): శోభాయాత్రలో డీజేలకు అనుమతి లేదని ఎస్పీ మహేష్ బి. గీతే అన్నారు. సోమవారం రాత్రి సిరిసిల్ల పట్టణంలోని పలు ప్రాంతాల్లో గణేశ్ మండపాలను ఎస్పీ పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేసి వినాయకుడి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేశ్ మండపాల నిర్వాహకులు పోలీస్‌శాఖ నిబంధనలు పాటించాలన్నారు. శాంతియుత వాతావరణంలో వేడుకలు నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, టౌన్ సీఐ కృష్ణ పాల్గొన్నారు.

కార్మికుల కూలి పెంపుపై కలెక్టర్ చర్చలు జరపాలి

● కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ అధ్వర్యంలో ధర్నా

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : టెక్స్‌టైల్ పార్క్‌లోని పరిశ్రమలల్లో పనిచేస్తున్న కార్మికుల కూలి పెంపుపై యాజమానులతో కలెక్టర్ చర్చలు జరిపి కార్మికులకు ప్రతి రోజు వెయ్యి కూలి వచ్చే విధంగా నిర్ణయించాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ టెక్స్‌టైల్ పార్క్ వర్కర్స్ యూనియన్‌ల అధ్వర్యంలో కార్మికులతో కలిసి ధర్నా చేశారు, ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి మూషం రమేష్, జిల్లా కమిటి సభ్యులు శ్రీరాముల రమేష్‌చంద్ర, గురజాల శ్రీధర్, టెక్స్‌టైల్ పార్క్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కూచన శంకర్, కార్యదర్శి కోడం రమణ, జెల్లసదానందం, దూడం సంపత్, అకుబత్తిని శ్రీకాంత్, అడెపు రవి, సంపత్, శ్రీనివాస్, వెంకటేష్, రంగయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీల చర్యలతోనే యూరియా కొరత

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ ఎంపీల చేతగానితనంతో రాష్ట్రానికి యూరియా కొరత ఏర్పడిందని సీపీఐ సిరిసిల్ల పట్టణ కార్యదర్శి పంతం రవి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చెబుతున్న లెక్కల ప్రకారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఇంకా రెండున్నర లక్షల టన్నుల యూరియా రావాల్సి ఉందన్నారు. సమావే శంలో సీపీఐ నాయకులు సోమ నాగరాజు, కడారి రాములు పాల్గొన్నారు.

తెలంగాణను ఎడారిగా మార్చేందుకే కుట్ర

- జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణను ఎడారిగా మార్చేందుకు కుట్రలు జరుగుతున్నాయని జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు పేర్కొన్నారు. మండలంలోని పొత్తూరు గ్రామంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాయకులు కదురు శేఖర్, గుంటి అంజయ్య, బండారి మహేష్, కోల రాజు, ఏనుగుల నవీన్, బండారి మహేందర్, గుంటి నాగార్జున, అనీల్, శ్రీకాంత్, నవీన్, సాయి, శివ పాల్గొన్నారు.

నూతన గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలి

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న కేలోతుతండా, శంకర్‌నాయక్‌తండా, రెడ్డితండాలను కలిపి ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ ఆ తండావాసులు శనివారం వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో తండావాసులు అజ్మీరా జగన్, నరహరి, రవీందర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు

- జిల్లాకు రజితం, కాంస్య పతకాలు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తాచాటారు. రాష్ట్ర స్థాయిలో రజితం, కాంస్య పతకాలను సాధించిన క్రీడాకారులను అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు పిల్లి రామచంద్రం, సంయుక్త కార్యదర్శి అజయ్ కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి కనకం శ్రీనివాస్ సోమవారం అభినందించారు. తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా పాలమూరు యూనివర్శిటీలో ఆదివారం జరిగిన అథ్లెటిక్స్ పోటీలలో హైజంప్ అండర్ - 20 పురుషుల విభాగంలో జిల్లా చెందిన వనపర్తి అబిరామ్ రజితం, కట్ల దివాకర్ కాంస్య పతకం సాధించారు.

30 ఏళ్ల నిరీక్షణకు మోక్షం

కోనరావుపేట, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి) : మంగళపల్లె గ్రామస్థుల చిరకాల వాంచ నెరవేరవడమే కాకుండా 30 ఏళ్ల నిరీక్షణకు మోక్షం లభించిందని కాంగ్రెస్ జిల్లా నాయకుడు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య అన్నారు. కోనరావుపేట మండలం మంగళపల్లె గ్రామానికి తారు రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు గ్రామస్థులు క్షీరాభిషేకం చేయగా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, గ్రామ శాఖ అధ్యక్షుడు బాదినేని బాల్‌రాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, డైరెక్టర్ అప్పాల నాగభూషణం, కాంగ్రెస్ నాయకులు కచ్చకాయల బాల్‌రెడ్డి, బి.శేఖర్, అవురం సురేష్, ఎరవెల్లి విజయ్, గొట్టె రుక్మిణి పాల్గొన్నారు.

కాళేశ్వరం నీళ్లపై రాజకీయం సరికాదు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు ఛీకొట్టినా ఆ పార్టీ నాయకులు కాళేశ్వరం నీళ్లంటూ రాజకీయం చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎడ్ల రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సారెస్పీ నీళ్లతో రాజరాజేశ్వర జలాశయం నిండితే కాళేశ్వరం జలాల వల్లే అని ఆ పార్టీ నేతలు పూజలు చేయడం సిగ్గుచేటని అన్నారు. సమావేశంలో నాయకులు రామచంద్రం, నర్సయ్య, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, గౌస్, బుచ్చాగౌడ్ మల్లారెడ్డి, బాల్‌రెడ్డి, శ్రీనివాస్, మధు పాల్గొన్నారు.

పోలీసుల బందోబస్తు మధ్య భూముల చదును

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండల కేంద్రంలోని దళిత భూములను ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించడం కోసం తహసీల్ అధికారులు శనివారం సిద్ధమయ్యారు. పోలీసు పహారాలో భూములను చదును చేయించారు. 70 ఏళ్లుగా భూముల్లో వ్యవసాయం చేస్తూ జీవిస్తున్న తమకు అన్యాయం చేస్తున్నారని బాధితులు వాపోయారు. భూములను లాక్కోవద్దని మొరపెట్టుకున్నారు. ఉన్నతాధికారుల సూచనతో అధికారులు వెనుదిరిగారు.

ఎస్టీయూ మండల కార్యవర్గం ఎన్నిక

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ వీర్నపల్లి మండల నూతన కార్యవర్గం ఎన్నికలను ఈ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి సదానందం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా రంగు ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కుమార్, కోశాధికారిగా సుమలత ఎన్నికయ్యారు.

అక్రమంగా ఇసుక, మట్టి తరలింపుపై చర్యలు తీసుకోవాలి

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక, మట్టిని తరలిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామస్థులు శనివారం తహసీల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. నారాయణపూర్‌కు చెందిన కొందరు రహస్యంగా తమ గ్రామ శివారు నుంచి మట్టి, ఇసుకను ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానికులు దేవరాజు, కిషన్, మల్లేశం, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల అరెస్టు హేయమైన చర్య

వేములవాడ టౌన్, సెప్టెంబరు 01 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి నిరసన తెలిపేందుకు వెళ్లే వారిని ముందస్తుగా అరెస్టు చేయడం హేయమైన చర్య అని బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ అన్నారు. పేదలకు సేవచేసే ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

రైతులపై కపట ప్రేమ చూపుతున్న బీఆర్ఎస్

వేములవాడ టౌన్, సెప్టెంబరు 01 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరతపై బీజేపీ ప్రభుత్వాన్ని నిలదీసే దమ్ము లేక రైతులపై కపట ప్రేమను చూపడం బీఆర్ఎస్ నాయకులు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు సంఘ స్వామి యాదవ్ అన్నారు. వేములవాడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తూ మర్రిపల్లి, కలికోట సూరమ్మ ప్రాజెక్టు, లచ్చంపేట చెరువు వంటి అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేస్తుంటే ఓర్వలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, బొజ్జ మల్లేశం, పర్శరాములు, అక్కనపల్లి నరేష్ ఉన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి



ప్రజల సమస్యలను వింటున్న జిల్లా కలెక్టర్



కలెక్టరేట్‌కు తరలివచ్చిన సారంపల్లి గ్రామస్థులు

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజలు తమ సమస్యలను ప్రజావాణిలో చెప్పుకునేందుకు కలెక్టరేట్‌కు తరలిరావడంతో కిటకిటలాడిపోయింది. ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, అర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాబాయ్, జడ్పీ సీఈవో వినోద్‌కుమార్, డీఆర్‌డీవో శేషాద్రి పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ ప్రజావాణిలో 126 దరఖాస్తులు రాగా ఇందులో రెవెన్యూ శాఖకు 37, హౌజింగ్‌శాఖకు 20, డీఆర్‌డీవోకు 10, జిల్లా విద్యాధికారికి 9, సిరిసిల్ల మున్సిపాల్టీకి 7, జిల్లా ఉపాధి కల్పన శాఖకు 7, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖకు 6, ఎస్డీసీకి 4, ఎస్పీ కార్యాలయానికి 4, జిల్లా పంచాయతీ అధికారికి 3, సెస్‌కు 3, జిల్లా వ్యవసాయాధికారికి 2, జిల్లా నీటిపారుదలశాఖకు 2, ఎస్సీ కార్పొరేషన్‌కు2, ఏడీఎస్ఎల్ఆర్‌కు 2, జిల్లా ఉద్యానవన శాఖ కు 2, జిల్లా వైద్యాధికారికి 1, మిషన్‌భగీరథకు 1, తంగళ్లపల్లి ఎంపీడీవోకు 1, ఇల్లంతకుంట ఎంపీడీవోకు 1 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో హౌజింగ్ ఈఈ శంకర్, జిల్లా పంచాయతీ అధికారి షర్ఫుద్దీన్ పాల్గొన్నారు.

సిరిసిల్లలో రోడ్డు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్ల పట్టణంలో రోడ్లను అక్రమించుకున్నవారిపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ న్యూరాష్ట్ర కార్యవర్గ సభ్యులు సోమిశెట్టి దశరథం సోమవారం జిల్లా కలెక్టర్‌కు కలిసి వినతిపత్రాన్ని అందించారు. పట్టణంలోని విద్యానగర్ నుంచి తాడూర్ గ్రామానికి పోయే రోడ్డును ఆక్రమించుకుని అక్రమణ నిర్మాణాలను చేపడుతున్నారని దీనిపై మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో గుజ్జే దేవదాస్, తడుక రాములు, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

గతంలో నిర్మించుకున్న ఇళ్లకు బిల్లులు ఇవ్వాలి

తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామంలో గతంలో నిర్మించుకున్న ఇళ్లకు రావాల్సిన బిల్లులను జిల్లా కలెక్టర్ స్పందించి మంజూరు చేసి మమ్ములను అదుకోవాలంటూ లబ్ధిదారులు సోమవారం జిల్లా కలెక్టరేట్‌కు తరలివచ్చిన జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను కలిసి వినతిపత్రం అందించారు.

తనకు ఇల్లు లేకున్నా ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకుంటే ఆన్‌లైన్‌లో ఇల్లు ఉన్నట్లు చూపిస్తుందని ఇల్లంతకుంట మండలం నర్సక్కపేట గ్రామానికి చెందిన రాగటి దేవదాస్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడం లేదని కలెక్టర్ స్పందించి ఆన్‌లైన్‌లో దానిని తొలగించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరాడు.

రహదారులకు మరమ్మతులు చేయాలి

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాల్లో ధ్వంసమైన రహదారులకు మరమ్మతులు చేయాలని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి సోమవారం పంచాయతీ రాజ్ డీఈ శ్రీనివాస్‌కు స్థానిక నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బుగ్గారెడ్డి, కుమార్‌యాదవ్‌లు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలో వెంకవ్వకు మంజూరైన రూ.30 వేల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును స్థానిక కాంగ్రెస్ నాయకులు సమవారం అందజేశారు. నాయకులు సతీష్, శ్రీనివాస్‌గౌడ్, రవి, మాధవరెడ్డి, మధు, ఆగం, అంజయ్య, రాములు ఉన్నారు.

శ్రీ కృష్ణ యాదవ సంఘం కార్యవర్గం ఎన్నిక

తంగళ్లపల్లి, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం చిన్న లింగాపూర్ గ్రామం శ్రీ కృష్ణ యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొలవేని ఎల్లం యాదవ్, ఉపాధ్యలుగా బోడపట్ల బాబు, ప్రధాన కార్యదర్శిగా జక్కుల రాజు, కోశాధికారిగా జక్కు ల తిరుపతి, కార్యవర్గ సభ్యులుగా ఆంజనేయులు, బొలవేని కళ్యాణ్, బోడ పట్ల సాయి కుమార్, వర్కల దేవరాజు, ముచ్చర్ల పోచయ్యలు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



సిరిసిల్లలో విద్యార్థులకు బోధిస్తున్న కలెక్టర్

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందీప్‌కుమార్ అకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలోని మధ్యాహ్న భోజనం సిద్ధం చేసి వంటశాల గదిని అందులో ఆహార పదార్థాల తయారీని క్షుణంగా పరిశీలించారు. అనంతరం 10 వతరగతి విద్యార్థులకు ఫిజిక్స్ బోధించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యాలయాల ఆవరణలను నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధోనోపాధ్యాయుడు చకినాల శ్రీనివాస్ ఉపాధ్యాయులు ఉన్నారు.

రోడ్లపై సంచరించే పశువులను గోశాలకు తరలిస్తాం

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని రోడ్లపై సంచరిస్తూ వాహనాల ప్రమాదాలకు కారణం అవుతున్న పశువుల(గోవులు /ఆవులు)ను వేములవాడ దేవాలయం గోశాలకు తరలిస్తామని సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎండీ ఖాదీర్‌పాషా తెలిపారు. ప్రమాదాలకు కారణం అవుతున్న పశువులను మూడు రోజుల్లో వాటి యజమానులు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. మూడు రోజుల అనంతరం మున్సిపల్ సిబ్బంది వాటిని వేములవాడ దేవాలయం గోశాలకు తరలిస్తారని తెలిపారు.

బీఆర్ఎస్‌పై బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలి



మిడ్ మానేరు జలాశయంలో పూజలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



తెలంగాణ తల్లికి జలాభిషేకం చేసి నిరసన తెలుపుతున్న నాయకులు

బోయినపల్లి, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పక్కకు పెట్టి కాళేశ్వరం పేరుతో బీఆర్ఎస్‌పై బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు బోయినపల్లి మండలం కొదురుపాక మిడ్ మానేరు జలాశయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొదురుపాక చౌరస్తా నుండి కొదురుపాక పాత గ్రామం వైపు ఉన్న మిడ్ మానేరు నీటి వద్దకు ర్యాలీగా వెళ్లి జలాశయంలో పసుపు, కుంకుమ, పూలు చల్లి పూజలు నిర్వహించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి అమరుల స్థూపానికి జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పి చైర్ పర్సన్‌లు తుల ఉమ, న్యాలకొండ అరుణ, గూడూరి ప్రవీణ్, మాజీ జెడ్పిటిసి కత్తెరపాక ఉమా కొండయ్య, గుంటి శంకర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

వేములవాడ టౌన్ : కాళేశ్వరం కమిషన్ విచారణ పేరుతో కేసీఆర్‌కు తప్పుడు నోటీసులు పంపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు నిరసనగా బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో గోదావరి జలాలతో తెలంగాణ తల్లి విగ్రహానికి జలాభిషేకం నిర్వహించారు. విద్యార్థి విభాగం నాయకుడు వంగళ శ్రీకాంత్ మాట్లాడుతూ కేసీఆర్‌పై కమిషన్ విచారణ పేరుతో తప్పుడు నోటీసులు పంపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ది చెబుతామని అన్నారు. ఈ కార్యకరమంలో ఈర్లపల్లి రాజు, రామతీర్థపు రాజు, నిమ్మశెట్టి విజయ్, నీరటి మల్లేశం, పోతు అనిల్, అంజాద్‌పాషా తదితరులు ఉన్నారు.

కోనరావుపేట : కోనరావుపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహానికి గోదావరి జలాలతో క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు న్యాలకొండ రాఘవరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, చంద్రయ్య గౌడ్, మాందాల శ్రీనివాస్, ప్రతాపరెడ్డి, జీవన్ గౌడ్, రమణారెడ్డి తదితరులు ఉన్నారు.



కోనరావుపేటలో క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వాడవాడలా గణనాథులకు పూజలు



అనుపురంలో పూజల్లో పాల్గొన్న సీఐ వీరప్రసాద్



రుద్రంగిలో 108 నైవేద్యాలు సమర్పించిన భక్తులు



రుద్రంగి కస్తూర్బాలో నెలకొల్పిన వినాయకుడి నిమజ్జనంలో పాల్గొన్న ఉపాధ్యాయినిలు

వేములవాడ టౌన్, సెప్టెంబరు 01 (ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రుల్లో భాగంగా పట్టణ సీఐ వీరప్రసాద్ సోమవారం గణేష్ మండపం వద్ద ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. మండలంలోని అనుపురం గ్రామంలోని శివసేన యూత్ ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాన కార్యక్రమానికి సీఐ హాజరయ్యారు. కార్యక్రమంలో ఎర్రం రాజు, పండుగ ప్రదీప్, ఎర్రం సత్తయ్య, ముదం శ్రీనివాస్‌లు గ్రామపంచాయతీ కార్యదర్శి దివ్య పాల్గొన్నారు. అనుపురం గ్రామంలోని ఎన్‌వైసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద నిర్వహకులు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేష్‌ను, మాజీ జడ్పీటీసీ మ్యాకల రవిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి వెంకటరమణరావు, పోరెడ్డి మల్లేశం, ఎర్రం ప్రవీణ్, శశి, సందీప్‌రెడ్డి, ముత్తయ్య ఉన్నారు.

రుద్రంగి : రుద్రంగి మండల కేంద్రంలో గణేష్ నవరాత్రుల సందర్భంగా సోమవారం సాయినగర్ కాలనీ ఆధ్వర్యంలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన మట్టి గణపతి వద్ద 108 నైవేద్యాలు సమర్పించారు. ఆలాగే మహలక్ష్మి యూత్, డిజె బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో అన్నధానం ఏర్పాటు చేశారు.

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి : ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పలు గ్రామాల్లో ప్రత్యేక పూజలందుకున్న గణనాథుడిని వాహనాల్లో ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. నృత్యాలు మధ్య ఆదిదేవుడు ముందుకు కదిలారు. పలు పార్టీల నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. మండపాల వద్ద అన్నదానం చేశారు. గ్రామ శివారుల్లోని నీటి వనరుల్లో నిమజ్జనం చేశారు.

రుద్రంగి : ఐదు రాత్రులు పూర్తి చేసుకుని ఆరవ రోజున రుద్రంగి మండల కేంద్రంలో పలు గణపతులను నిమర్జనం చేశారు. రుద్రంగిలో కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో ఏర్పాటు చేసిన గణనాదుడికి విద్యార్థులు నృత్యాలు చేస్తూ, గణేష్ మహరాజ్‌కీ జై అంటూ నినాదాలు చేస్తూ ఊరేగింపు చేసి బతుకమ్మ చెరువులో నిమర్జనం చేశారు.

చందుర్తి: మండల కేంద్రంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో సోమవారం మాజీ జడ్పీ చైర్ పర్సన్ తుల ఉమ ప్రత్యేక పూజలు చేశారు. సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్,సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఎల్లారెడ్డిపేట : మండలంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు రేపాక రామచంద్రారెడ్డి, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, పలు పార్టీల నాయకులు గణనాథుడిని దర్శించుకున్నారు.

గంభీరావుపేట : మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేష్ ఆధ్వర్యంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఇటీవల మానేరు వద్ద వరదలో చిక్కుకున్న రైతులను కాపాడటమే కాకుండా వరదలో గల్లంతైన రైతు నాగం కుటుంబానికి తన వంతు సాయంగా 1 లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని బండి సంజయ్ అందజేశారన్నారు. అదే విధంగా వరద బాధితులకు బండి సంజయ్ 10 లక్షలు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు కోడె రమేష్, మండల ప్రధాన కార్యదర్శులు మల్లేశ్‌యాదవ్, విగ్నేష్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు గంట అశోక్, జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, మైనార్టీ మోర్చ జిల్లా అధ్యక్షుడు వాజీద్, నాయకులు లక్ష్మీపురం రాజు, సత్యనారాయణ, ఎలెందర్, నాగరాజు, శ్రీనివాస్, భాస్కర్, రవీందర్, నరేష్, రాజు, వెంకటేష్, మధు తదితరులు ఉన్నారు.

ఇల్లంతకుంట: ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక మంగళవారం జరుగుతున్నట్లు ఎంపీడీఓ శశికళ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగే సమావేశంలో గత సంవత్సరం ఏప్రిల్ ఈ సంవత్సరం మార్చి వరకు గ్రామాలలో చేసిన పనుల నివేదికలపై చర్చించడానికి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఇల్లంతకుంట : బీసీ అభివృద్ధికి కాంగ్రెస్‌పార్టీ అండగా నిలుస్తుందని పార్టీ పిషరీష్ చైర్మన్ జెట్టి మల్లేశం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో 42శాతం రిజర్వేషన్ ఇవ్వడానికి అసెంబ్లీలో తీర్మాణం చేయడం అభినందనీయమన్నారు.

-ఇల్లంతకుంట మండలంలోని మూడు గ్రామాలలో గోదాం లేకపోవడం వల్ల రైతులకు యూరియా దొరకడం లేదని ప్యాక్స్‌డైరెక్టర్ నాయిని నవీన్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెల్జీపూర్, ఒగులాపూర్, గూడెపుపల్లి గ్రామాలలో గోదాం లేక యూరియా రావడం లేదన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన చేస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఎంప్లాయిస్ జేఏసీ టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షులు ఎలుసాని ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్ల చొక్కాలు, నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగుల పాలిట శాపంగా మారిన కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం అంతమయ్యే వరకు విశ్రమించకుండా పాత పెన్షన్ విధానాన్ని సాధించుకోవాలని పోరాటం చేస్తున్నామన్నారు. సెప్టెంబరు 1ని బ్లాక్‌డేగా ప్రకటిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోకన్వీనర్ సమరసెన్, కార్యదర్శులు గాజులు సుదర్శన్, సయ్యద్‌జబి, టీఎన్‌జీవో అసోషియేట్ అధ్యక్షుడు మెట్ట శ్రీకాంత్, కోశాధికారి ఎండి రియాజ్‌పాషా, టీజీవో అసోషియేట్ అధ్యక్షుడు జోగం రాజు, కోశాధికారి అహ్మద్ రసూల్, జాయింట్ కార్యదర్శి శ్రీకాంత్, అర్గనైజింగ్ కార్యదర్శి సాగర్, మహిళా ఉపాధ్యక్షురాలు జానకి, ట్రేసా అధ్యక్షుడు జయంత్‌కుమార్, ఎఈఈ అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఎఈవో అధ్యక్షులు లక్ష్మన్, పంచాయతీ కార్యదర్శులు సంఘం అధ్యక్షుడు అనిల్, ఎఎస్‌వో సంఘం అధ్యక్షులు సుమన్; నాలుగో తరగతి సంఘం జిల్లా అధ్యక్షుడు జీవన్, దేవాదాయ శాఖ ఫోరమ్ అధ్యక్షుడు శివకుమార్; సభ్యులు అధ్యాపకులు శేఖర్,గోపీ, జయభారత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇల్లంతకుంట : పెన్షన్ పొందడం ఉద్యోగుల ప్రాథమిక హక్కు అని సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అయ్యన్నగారి హరికృష్ణారెడ్డి పేర్కొన్నారు. పెన్షన్ విద్రోహదినాన్ని పురస్కరించుకొని మండలంలోని వెల్జీపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కాట్నపెల్లి స్వామిరెడ్డి, అన్నపూర్ణ, రాజిరెడ్డి, కుమారస్వామి, అరుణ, అనురాధ, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి : నూతన పింఛన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండల కేంద్రాలతో పాటు వెంకటాపూర్, రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, రాచర్లగుండారం, రాచర్లతిమ్మాపూర్, అల్మాస్‌పూర్, నారాయణపూర్, కంచర్ల, గర్జనపల్లి, అడవిపదిర తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చందుర్తి : ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ అమలు చేయాలని కోరుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో చందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులు, నర్సింగాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పంచాయతి కార్యదర్శులు పాల్గొన్నారు.